ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య జిల్లా వార్తలు
5
మంగళవారం 27 ఫిబ్రవరి 2024



ఎన్నికల టీం రెడీ..



● ఎన్నికలు ప్రశాంతంగా జరుపుతాం ● ఒక్క సంఘటనా జరగకుండా పటిష్ట చర్యలు ● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



అభిషిక్త్ కిశోర్, కలెక్టర్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాబోయే సాధారణ ఎన్నికలను జిల్లా యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదు. ఇంకా చెప్పాలంటే.. కనీసం ఒక సంఘటన కూడా జరగకూడదు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ 80 శాతం తగ్గకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం.. ఏదైనా ఫిర్యాదు వస్తే తక్షణమే పరిష్కరిస్తాం. ఈ మేరకు అవసరమైన పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. అందుకు తగ్గట్టు ఇప్పటికే జిల్లా ఎన్నికల టీం సిద్ధంగా ఉంది. ఆ టీం ట్రైనింగ్ కూడా పూర్తి చేసుకుంది. కాబట్టి ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తామనే పూర్తి నమ్మకం ఉందని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఎన్నికలు విజయవంతంగా నిర్వహిస్తామనే నమ్మకం ఉంది

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరపాలన్నదే నా ధ్యేయం. ఇప్పటి వరకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అనేక చర్యలు తీసుకున్నాం. ఈ రెండు వారాల్లో జరిగిన పనితీరును బట్టి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయగలమనే నమ్మకం నాకు కలిగింది. ఎన్నికల బదిలీల్లో వచ్చిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు పూర్తిగా విధుల్లో చేరారు. 20 మంది జిల్లా స్థాయి అధికారులను నోడల్ ఆధికారులుగా నియమించాము. సమర్థవంతమైన అధికారులతో జిల్లా ఎన్నికల టీం రెడీ అయింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేయమని ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. నిబంధనలకు విరుద్ధంగా ఏ అధికారీ చేయాల్సిన అవసరం లేదు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం..అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. పోలీసు అధికారులతో కూడా సమన్వయంతో ఏర్పాట్లు చేస్తాం.

పరిస్థితులను బట్టి చర్యలు

ఎన్నికలు సమర్థవంతంగా జరపడానికి ప్లానింగ్, ట్రైనింగ్, ఐటీ అప్లికేషన్లు ముఖ్యం. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలోని పరిస్థితులపై అవగాహన ఉంది. ఆయా పరిస్థితులను బట్టి తగిన చర్యలు, ఏర్పాట్లు ఉంటాయి. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ వరకు ఏం చర్యలు తీసుకోవాలో అనే దానిపై ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చాం. వచ్చే వారంలో ఢిల్లీలో జిల్లా ఎన్నికల అధికారిగా నాకు కూడా శిక్షణ ఉంటుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అధికారులు అందరికీ శిక్షణ పూర్తయింది. ఎంసీసీ పూర్తిగా అమలు చేస్తాం. జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఉంటుంది.

ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా సాధ్యమైనంత ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు చేపట్టనున్నాం. ఓటు విలువ ప్రజలకు తెలియజేసి ఓటు వేసేలా అవగాహనా కార్యక్రమాలు చేపడతాం. కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కోసం సమావేశాలు నిర్వహిస్తాం. వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లో ఓటుపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. 80 శాతానికి తక్కువ లేకుండా ఓటింగ్ జరిగేలా చేయాలని అనుకుంటున్నాం. జిల్లాలో చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలలో మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నాం. రాజకీయ పార్టీలతో పాటు వివిధ వర్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులపై శ్రద్ధ పెడతాం. మైక్రో అబ్జర్వర్లు పరిశీలిస్తూ ఉంటారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు ఉంటుంది. ఎక్కడా చిన్న సమస్య కూడా లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలి.

లారీ కింద ఇరుక్కుపోయిన కృష్ణబాబు, వినీత



జ్వరమని.. ఆస్పత్రికి వెళుతూ..

● లారీని ఢీకొన్న బైక్
● ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
● సరస్వతిపల్లెలో విషాదం



దేగల లక్ష్మీభవానీ (ఫైల్)



దేగల వినీత (ఫైల్)



దేగల కృష్ణబాబు (ఫైల్)

రామాపురం, ఫిబ్రవరి 26: కుమార్తెకు జ్వరం వస్తుండటంతో ఆస్పత్రికి వెళుతూ కుమార్తెతో పాటు తల్లి, ఆమె బావ కొడుకు అనంతలోకాలకు వెళ్లారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ఐరిస్ గ్రాండ్ హోటల్ సమీపంలో లారీని వెనుకవైపు నుంచి బైక్ ఢీకొనడంతో దేగల లక్ష్మీభవానీ (25), ఆమె కుమార్తె దేగల వినీత (5), ఆమె బావ కుమారుడు దేగల కృష్ణబాబు (21) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామాపురం మండలం సరస్వతిపల్లెకు చెందిన దేగల లక్ష్మిభవానీ, తన కుమార్తె దేగల వినీతకు జ్వరం వస్తుండడంతో రాయచోటిలోని ఆస్పత్రికి వెళ్లేందుకు తన బావ కుమారుడైన కృష్ణబాబుతో కలిసి బైక్‌లో రాయచోటికి బయలుదేరారు. మార్గమధ్యంలోని బండపల్లె పంచాయతీలోని ఐరిస్ గ్రాండ్ హోటల్ వద్దకు వెళ్లగానే వీరి ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా కుడివైపు నుంచి ఎడమపక్కకు రావడంతో బైక్ వేగంగా వెళ్లి లారీ వెనుకవైపున ఢీకొంది. ప్రమాదంలో బైక్ లారీ వెనుకవైపు లోపలికి దూసుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా లక్ష్మిభవాని భర్త ధనుంజయ వ్యవసాయం చేసుకుంటూ ఇంటి వద్దే ఉన్నాడు. వీరికి ముగ్గురు సంతానం కాగా భార్యతో పాటు రెండో కుమార్తె ప్రమాదంలో చనిపోయింది. పెద్దకూతురు మోక్షిత (6), కుమారుడు మోక్షిత్ (4) ఉన్నారు. వీరంతా స్థానికంగా ఉన్న పాఠశాలకు వెళుతున్నారు. కాగా తల్లి చనిపోయిందని తెలియని ఆ చిన్నారులు ఆడుకుంటూ ఉండటం చూపరులను కంటతడి పెట్టించింది. మరో మృతుడు కృష్ణబాబు తండ్రి చెన్నకేశవ కువైత్‌లో ఉన్నాడు. ఇతడు కూడా కువైత్‌లో ఉంటూ ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. ఇతడికి తమ్ముడు మహేశ్ ఉన్నాడు. అతడు బీటెక్ చదువుతున్నాడు. ఒకే కుటుంబానికి చెందిన వారు మృతి చెందడంతో సరస్వతిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధరబాబు, రామాపురం ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. మృతి చెందిన వారిని శవపరీక్ష కోసం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల ప్రాణాలను తోడేస్తున్న జగన్

● మద్యపాన నిషేధంపై మాట తప్పిన సీఎం ● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: కల్తీ సారా, కల్తీ మద్యంతో ప్రజల ఆరోగ్యంతో సీఎం జగన్‌రెడ్డి చెలగాటమాడుతున్నారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు విమర్శించారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చీప్‌లిక్కర్, కొత్త కొత్త బ్రాండ్స్ పేరుతో మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే నాసిరకం మద్యం తాగిన వారిలో దాదాపు 35 లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిని అనారోగ్యాలతో ఆసుపత్రిపాలయ్యారని, అందులో 30 వేల మంది ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రాష్ట్రంలో 4 లక్షల బెల్ట్ షాపులు, మొబైల్ షాపులు పెట్టించి ప్రజల రక్తపు మాంసాలతో జగన్‌మోహన్‌రెడ్డి వ్యాపారం చేస్తున్నారని, మద్యం షాపుల్లో నగదు లావాదేవీలు మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. డిజిటల్ పేమెంట్స్ ఎందుకు అనుమతించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి కోసమే మద్యం షాపుల్లో నగదు పేమెంట్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం రేట్లను మూడు రెట్లు పెంచి 52 నెలల తన పరిపాలనలో సుమారు రెండు లక్షల కోట్ల నాసిరకం మద్యం విక్రయించి వాటి ద్వారా లక్షల కోట్లు ఆదాయాన్ని జగన్ పోగు చేసుకున్నాడని ధ్వజమెత్తారు. అంతేగాక ఇప్పటికే వైసీపీ ప్రభుత్వం 15 సంవత్సరాల పాటు మద్యం ఆదాయం తాకట్టు పెట్టి 4 లక్షల కోట్లు అప్పు తెచ్చిందన్నారు. నాసిరకం మద్యంతో పాటు గంజాయి, డ్రగ్స్ బారినపడ్డ యువత నిర్వీర్యం అయిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం మద్యం వల్ల అత్యాచారాలు, నేరాలు రాష్ట్రంలో భారీగా పెరిగాయన్నారు. సమావేశంలో సుండుపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు కల్లే రెడ్డెప్ప, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దప్పేపల్లె చంద్రమౌళి, సుండుపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి సుబ్రహ్మణ్యం, పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి నేతి రమేశ్, సుండుపల్లె మండల ఐటీడీపీ నాయకుడు ఎల్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 26: టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు మంగళవారం నుంచి మార్చి 6వతేదీ వరకు జరుగుతాయని జిల్లా పరిశీలకులు, మోడల్ స్కూలు జేడీ ఎంవీ క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. టెట్ పరీక్షలకు సంబంధించి సోమవారం డీఈవో కార్యాలయంలో డీఈవో అనురాధ అధ్యక్షతన నిర్వహణ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి మార్చి 6 వరకు రోజుకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరూ తప్పనిసరిగా వారి ఒరిజినల్ ఐడీ కార్డులు తెచ్చుకోవాలని సూచించారు. నిర్ణీత సమయం కంటే గంట ముందే పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలన్నారు. హాల్‌టికెట్‌లో ఏదైనా తప్పులుంటే సంబంధిత పరీక్ష కేంద్రంలో సరిచూసుకోవాలన్నారు. అంగవైకల్యం కలిగిన అభ్యర్థులకు అదనంగా 50 నిమిషాలు సమయం కేటాయిస్తామన్నారు. అలాగే ఇతర వివరాలకు 7207113047, 9133356786, 9441557508 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, డిపార్ట్‌మెంటు ఆఫీసర్లు పాల్గొన్నారు.



సీటీఎం రైల్వేస్టేషన్‌లో పనులు ప్రారంభించి మాట్లాడుతున్న ఆర్డీవో హరిప్రసాద్

సీటీఎం రైల్వేస్టేషన్‌లో రూ.8.39 కోట్ల పనులకు శ్రీకారం

● వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ

మదనపల్లె టౌన్/ఒంటిమిట్ట, ఫిబ్రవరి 26: దేశంలోని విభిన్న సంస్కృతుల ప్రజలను ఏకం చేస్తోంది ఇండియన్ రైల్వేస్ అని ఆర్డీవో హరిప్రసాద్ తెలిపారు. సోమవారం మదనపల్లె మండలంలోని సీటీఎం రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జరుగుతున్న పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో హరిప్రసాద్ మాట్లాడుతూ 1886లో దేశంలో రైలు రవాణా ప్రారంభించిందని, దేశంలో విభిన్న సంస్కృతులు, భాషలు ఉపయోగించే ప్రజలు ఉన్నారన్నారు. ఈ రైల్వే రవాణా వలన దేశంలోని అందరూ కలుసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. ప్రయాణికులకు చార్జీలు కూడా అతి తక్కువగా ఉంటాయన్నారు. వృద్ధులకు, క్యాన్సర్ పేషెంట్లకు రాయితీ చార్జీలు అమలు చేస్తున్నారు. పదేళ్ల కిందటితో పోలిస్తే శుభ్రత, పరిశుభ్రతకు మారుపేరుగా రైల్వేస్టేషన్లు ఉన్నాయన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 554 రైల్వేస్టేషన్లు పునరాభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.41 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా సీటీఎం రైల్వేస్టేషన్ ఎంపిక కావడం ఇక్కడి ప్రజల అదృష్టంగా భావించవచ్చన్నారు. సీటీఎం-2 పంచాయతీ అభివృద్ధి చైర్మన్ బి.అక్కులప్ప, సీటీఎం-2 సర్పంచ్ ఆనందపార్థసారథి మాట్లాడుతూ దేశం ఆర్థిక పురోభివృద్ధిలో ప్రపంచంలో 11 స్థానం నుంచి 5వ స్థానానికి ఎగబడిందని గుర్తు చేశారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, జ్ఞానోదయ హైస్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టేషన్‌మాస్టర్లు కరుణాకర్, వెంకటేశ్, రిటైర్డ్ స్టేషన్ మాస్టర్లు రమణ, మనోహర్‌దాస్, శ్రీధర్, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైల్వేలైన్ల అనుసంధానమే బీజేపీ లక్ష్యం

దేశవ్యాప్తంగా రైల్వేలైన్ల అనుసంధానమే బీజేపీ లక్ష్యమని బీజేపీ జాతీయ ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు తుమ్మలూరు హరిప్రసాద్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అమృత్ భారత్ స్టేషన్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా మంటపంపల్లె రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న అండర్ పాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ దేశమైనా ఆర్థికంగా బాగుండాలంటే ఆ దేశంలో రవాణా వ్యవస్థ ఎంతో ముఖ్యమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాబు సుభాన్, రైల్వే అధికారులు సీటీఐ ఫైజుల్లాఖాన్, చీఫ్ సూపరింటెండెంట్ ఎం.కిరణ్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సురేశ్‌కుమార్, రాజంపేట బీజేపీ కన్వీనర్ డాక్టర్ రాంప్రసాద్, విస్తరక్ ఆదినారాయణ, మండల అధ్యక్షుడు దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



మంటపంపల్లెలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్

కుప్పంలో వైసీపీది రక్త చరిత్ర

● చంద్రబాబుది అభివృద్ధి ముద్ర : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న నల్లారి కిశోర్

కలికిరి, ఫిబ్రవరి 26: కుప్పంలో ఈ నాలుగేళ్ల వైసీపీది రక్త చరిత్ర కాగా చంద్రబాబు పాలనలో వేసింది అభివృద్ధి ముద్ర అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. చంద్రబాబును విమర్శించే నైతిక అర్హత సీఎం జగన్‌కు ఏమాత్రం లేదని ఆయన ధ్వజమెత్తారు. అన్నమయ్య జిల్లా కలికిరిలోని నగరిపల్లెలో ఏర్పాటు చేసిన సోమవారం మీడియా సమావేశంలో కుప్పంలో జగన్ చేసిన విమర్శలను ఘటుగా తిప్పికొట్టారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి ఇసుక నుంచి వేల కోట్ల రూపాయలు లూటీ చేశారని విమర్శించారు. మద్యం డిస్టిలరీలను నిర్వహిస్తూ పేదల ఆరోగ్యాన్ని పీల్చి పిప్పి చేశారని, భూఆక్రమణలతో కుప్పం నుంచి పీలేరు వరకూ వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా చెలరేగిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కుప్పం నడిబజార్‌లో చెరబట్టి గెలుపు దక్కించుకుని ఇప్పుడు నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల క్రితమే చంద్రబాబు పులివెందులకు తాగు నీరు, సాగునీరు అందించిన విషయం మరిచిపోవడమేమిటని ప్రశ్నించారు. ఒకప్పటి టీడీపీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డిని వైసీపీలో చేర్చుకునేందుకు వెంపర్లాడుతున్నారని పులివెందులకు ఎవరు నీళ్లు పారించారో సతీశ్‌రెడ్డే చెబుతారని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేయలేని పనిని చేసి చూపించిన చంద్రబాబుకు పులివెందుల బహిరంగసభలో సతీశ్‌రెడ్డి పాదాభివందనం చేసి కృతజ్ఞతలు చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇజ్రాయిల్ వ్యవసాయం, డ్రిప్ ఇరిగేషన్‌లాంటి పథకాల ద్వారా కుప్పం రైతుల జీవితాలను సమూలంగా మార్చింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. తల్లీ, చెల్లీ దూరమై సీఎం వైఫల్యాలను రాష్ట్రవ్యాప్తంగా ఎండగడుతున్న విషయం వాస్తవం కాదా అన్ని ప్రశ్నించారు. వైఎస్ వివేకానంద రెడ్డిని ఎవరు హత్య చేశారో, ఎవరు చేయించారో పులివెందులలోనే చెబుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా జగన్ నాశనం చేశారని షర్మిల చేస్తున్న బహిరంగ విమర్శలకు కుప్పం సభలో జవాబు చెప్పి ఉంటే బాగుండేదన్నారు. చిత్తూరు జిల్లాలో జరిగిన అభివృద్ధి మొత్తం టీడీపీ హయాంలోనే జరిగిందని వివరించారు. 2017లో మదనపల్లె తిరుపతి హైవే మంజూరైతే దాని ఘనత తమదేనని చెప్పుకోవడం సిగ్గుచేటని కిశోర్ విమర్శించారు. ఐదేళ్ల క్రితమే మదనపల్లె వరకూ హంద్రీ నీవా నీళ్లను చంద్రబాబు పారించారని, అప్పుడే కుప్పానికి పథక రచన జరిగిందని గుర్తు చేశారు. ఈనెల 29వ తేదీ నుంచి పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు చీరలు, ప్యాంట్లు, షర్టులు పంపిణీ చేయబోతున్నారని, వైసీపీ నిజంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేసి ఉంటే ఈ అడ్డమైన పనులెందుకని నిలదీశారు. పూర్తి మద్యపానం చేసి ఓట్లు అడుగుతానని హామీ ఇచ్చిన సీఎం నాసి రకం మద్యం సరఫరా చేసి వేలాది మంది ప్రాణాలను హరించారని, లక్షలాది మంది ఆరోగ్యాలను గుల్ల చేశారని చెప్పారు. మద్యం షాపులను కొనసాగిస్తూనే ఎన్నికలు వెళుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబును వేలెత్తి చూపే అర్హత సీఎంకు గానీ, పెద్దిరెడ్డికి గానీ లేదని పదే పదే అంశాలవారీగా విశదీకరించారు.

రైతులను చంపడం రామరాజ్యమా

నిరసన ప్రదర్శనలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య



ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కడప నగరంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 26: అన్ని రకాలపంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని ఆందోళన చేస్తుంటే పోలీసుల ద్వారా రైతులను కాల్చి చంపడమే రామరాజ్యమా అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. సోమవారం కడపలో సీపీఐ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఎద్దులబండ్లు, వ్యవసాయ ట్రాక్టర్లు, రైతులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతు ఆత్మహత్యలను ప్రతిబింబిస్తూ మెడకు ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల ఆదాయం రెట్టింపు చేస్తా అని ప్రగల్భాలు పలికిన మోదీ ఇప్పటివరకు కనీసం మద్దతు ధర కూడా ఇవ్వలేదన్నారు. దేశంలో వ్యవసాయం ఆదాయకరంగా అప్పుల బాధలతో లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పొట్ట కొట్టేందుకు బీజేపీ పెద్ద కుట్ర పన్నుతోందన్నారు. చంద్రబాబు, జగన్, పవన్ ముగ్గురు బీజేపీకి కట్టు బానిసల్లాగా ఉన్నారన్నారు. దేశం బాగుపడాలంటే రైతు బాగుండాలంటే బీజేపీని గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం దస్తగిరిరెడ్డి, బాబు భాయ్, జాకీర్, ఎన్.వెంకటశివ, ఎంవీ సుబ్బారెడ్డి, మనోహర్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.



ఉరితాళ్లతో రైతుల వినూత్న నిరసన

అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపాలి

● జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: ప్రజల అర్జీలపై ప్రత్యేక శ్రద్ధతో నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీదారులు సంతృప్తిచెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్‌ఎల్‌ఏ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. ఈ స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్లుగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీలు



మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) ఫిబ్రవరి 26 : సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను పారాలీగల్ వలంటీర్లుగా నియమిస్తున్నట్లు డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ తెలిపారు. సోమవారం నగరంలోని పురుషులు, మహిళల కేంద్ర కారాగారాల్లోని పారాలీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళల కేంద్ర కారాగారాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు పనిచేస్తున్నాయన్నారు. వీటిలో పారా లీగల్ వలంటీర్లు ఖైదీల సమస్యలను తెలుసుకుంటూ, వారు ఇచ్చే అర్జీలను లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు ఇస్తార న్నారు. వీటిని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం కేంద్ర కారాగారంలో ఉన్న బీరువాల తయారీ ఫ్యాక్టరీని, బేకరీని జడ్జి పరిశీలించారు. కార్యక్రమంలో జైలు అధికారులు, ఖైదీలు పాల్గొన్నారు.

మోదీ ఆధ్వర్యంలో దేశం పురోగతి



రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రారంభిస్తున్న దేవగుడి శివనారాయణరెడ్డి

కొండాపురం, ఫిబ్రవరి 26: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాలలో పురోగతి సాధిస్తోందని రైల్వే జడ్ఆర్‌యూసీసీ మాజీ మెంబర్ దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు.అమృత్ భారత్ పథకంలో భాగంగా సోమవారం రూ.41 వేల కోట్లతో దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ 554 రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి, 500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్ పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. అందులో భాగంగా మండలంలోని దత్తాపురం గ్రామం వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. విమానాశ్రయాలకు దీటుగా కేంద్రప్రభుత్వం రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు నరసింహారెడ్డి, ప్రశాంత్, బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి మాజీ సర్పంచ్ శ్రీరంగనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల పేర్లు నమోదు చేసుకోవాలి

● జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఐజే రఘురామయ్య

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: త్వరలో జరగబోవు సాధారణ ఎన్నికల్లో బందోబస్తు నిమిత్తం ఆసక్తి గల మాజీ సైనికులు కడపలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఐజే రఘురామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల్లో బందోబస్తు విధుల్లో పాల్గొనదలచిన ఆసక్తి గల మాజీ సైనికుల వివరాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్, ఎస్పీ కృష్ణారావు ఆదేశించారన్నారు. ఈ మేరకు ఆసక్తి గల 50 ఏళ్లలోపు వయస్సు ఉన్న మాజీ సైనికులు వెంటనే తమ వివరాలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి కడప వారి కార్యాలయంలో నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రాంతీయ వైద్యశాలలో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 26: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం సంబంధిత రాష్ట్ర అధికారులు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సమస్యలు, సిబ్బంది పనితీరు, డాక్టర్ల సంఖ్య తదితర అంశాలపై మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషాను అడిగారు. వార్డులను పరిశీలించారు. కాన్పుల వార్డులో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పనితీరుపై ఆరా తీసినట్లు సమాచారం. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తున్నారా, సిబ్బందిలో ఎవరైనా రోగులకు ఇబ్బంది కలిగిస్తున్నారా, ఎవరెవరు ఆస్పత్రిలో ఎంత కాలం నుంచి పనిచేస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం కాయకల్ప కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర బృందం డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్, డాక్టర్ విజయ్‌కుమార్ తనిఖీలో పాల్గొన్నారు. స్థానిక డాక్టర్లు, నర్సింగ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి హాకీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన జిల్లా జట్టుతో జిల్లా హాకీ సంఘం సెక్రెటరీ శేఖర్ తదితరులు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 26: జిల్లా స్థాయి హాకీ ఉమన్ సబ్ జూనియర్, సీనియర్ హాకీ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా హాకీ సెక్రెటరీ శేఖర్ తెలిపారు. ఈనెల 25వ తేదీ కడప స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీ ఎదయ్ దీప, పీఈటీలు ప్రదీప్, సంతోషి, యూన్సీ, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ, ఎంఈడీ పరీక్షల ప్రారంభం



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ప్రొఫెసర్ ఈశ్వరయ్య

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 26 : వైవీయూ పరిధిలో బీఈడీ, ఎంఈడీ సెమిస్టరు పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 13 కళాశాలల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డి,హైపవర్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ విజయరాఘవ ప్రసాద్ తనిఖీ చేశారు. వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య మార్గదర్శకంలో పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామనిఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



సమావేశానికి హాజరైన జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలీసు సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డీఎస్పీ సుధాకర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, ఏ ఆర్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, ఎన్నికలకు సంబంధించిన ప్రత్యేక చట్టాలపై అధికారులకు అవగాహన కల్పించారు. పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు పరిశీలించడంతోపాటు, సంబంధిత అధికారులతో సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు.

విలీనానికి ముందున్న ఇన్‌సెంటివ్‌లు .. అలవెన్స్‌లు చెల్లించాలి

● ఆర్టీసీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు



సదస్సులో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదర్‌రావు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 26 : ఆర్టీసీ గ్యారేజీ సిబ్బందికి విలీనానికి ముందున్న ఇన్సెంటివ్ స్కీం, అలవెన్స్‌లు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ రీజనల్ మేనేజరు కార్యాలయ భవన సముదాయ సమావేశ మందిరంలో కడప జోన్‌లో పనిచేస్తున్న 52 డిపోల గ్యారేజీ సిబ్బంది, కడప నాన్ ఆపరేషన్ సిబ్బందితో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా దామోదర్‌రావు హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారేజీ సిబ్బందికి సంబంధించిన 51 డిమాండ్లను ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతున్నామన్నారు. గ్యారేజీలోని సిబ్బంది లోటు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విలీనానికి ముందు జీతంతో పాటు చెల్లింపులు చేసి, విలీనం అనంతరం నిలుపుదల చేసిన ఓవర్ టైం డ్యూటీ (ఓటీ), అలవెన్స్‌లను సాధించుకోగలిగామన్నారు. ఈ నెల నుంచి నైట్‌హాల్ట్ డ్యూటీ అలవెన్స్‌లు కూడా జీతంతో పాటే చెల్లించేలా ఆదేశాలు రావడానికి కారణం తమ యూనియన్ కృషేనన్నారు. ఇంకా మిగిలి ఉన్న కండక్టర్లు, డ్రైవర్లు మెయింటెనెన్స్ సిబ్బందికి విలీనానికి ముందు ఉండి, ఇప్పుడు తొలగించిన గ్యారేజీ సిబ్బంది ఇన్సెంటివ్, డ్రైవర్లకు ఆయిల్ పొదుపుపై ఇచ్చే ఇన్సెంటివ్‌లతో పాటు మహిళా కండక్టర్లకు ప్రతి నెలా ఇచ్చే హెల్త్ అలవెన్స్ సాధించుకునేందుకు పోరు కొనసాగిస్తామన్నారు. తదనంతరం ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు గిడుగు వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ గ్యారేజీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. స్పేర్‌పార్ట్స్ సరిపడా సప్లై చేయడమే కాకుండా మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా టూల్స్‌ను సప్లై చేసేలా చూస్తామన్నారు. ఆధునిక టెక్నాలజీలో సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పి.గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ భాస్కర్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు, రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, ఉపాధ్యక్షుడు వై.నాగరాజు, రాష్ట్ర నాయకులు మజీద్, ముగరమ్మ, రాధాకృష్ణ, జోనల్ కమిటీ సభ్యులు, 8 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, 52 డిపోల గ్యారేజీ కమిటీ నాయకులు, నాన్ ఆపరేషన్ యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్ల అణచివేతపై పోలీసు సిబ్బందికి శిక్షణ





యాంటీ రయట్ డ్రిల్ చేస్తున్న సిబ్బంది (ఇన్‌సర్ట్) వజ్ర వాహనంపై పోలీసు ఉద్యోగి

కడప (క్రైం), ఫిబ్రవరి 26 : ఎన్నికల సమయంలో అల్లర్లను సమర్థవంతంగా అడ్డుకునేందుకు సివిల్, స్పెషల్‌పార్టీ పోలీసు సిబ్బందికి నాలుగు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. సోమవారం ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ కృష్ణారావు ఈ శిక్షణను పరిశీలించి సిబ్బంది స్పందనపై ఆరా తీశారు. ఎస్పీ ఆలోచనా విధానానికి తగ్గట్లుగా తాము మరింత మెరుగ్గా విధులు నిర్వహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదుర్కోగలమనే ధీమాను పెంపొందించిందని సిబ్బంది సమాధానమిచ్చారు. అల్లరి మూకలను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. సోమవారం టియర్‌గ్యాస్ గన్, వజ్రవాహన వినియోగం, లాఠీ డ్రిల్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

అల్లరి మూకల భరతం పడతాం



ప్రశాంత స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యంగా ఎస్పీ సిద్దార్థ కౌశల్ సిబ్బందిలో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణ ఇవ్వడం అందులో నేను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. అల్లరి మూకలకు, సంఘ విద్రోహులకు గుణపాఠం చెప్పేందుకు మేమంతా సిద్ధం.

- ఎ.శ్రీనివాసులు, హెచ్‌సీ, బికోడూరు పీఎస్

ఆత్మవిశ్వాసం రెట్టింపు చేసింది



ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంతో ఉపయోగకరంగా ఉంది. మాలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఎలాంటి కఠిన పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోగలమన్న ధీమాను కల్పించింది.

- జి.సురేష్‌బాబు, దువ్వూరు పీఎస్

అన్న క్యాంటీన్‌తో పేదల కడుపు నింపిన సురేష్‌నాయుడు



సన్మానం అందుకుంటున్న సురేష్ నాయుడు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 26 : అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల కడుపు నింపిన ఘనత సీఎం సురేష్ నాయుడుదేనని మన ప్రజాసేవాసమితి అధ్యక్షుడు అయూబ్ ఖాన్ కొనియాడారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గల పీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో అన్న క్యాంటీన్ ఏర్పాటై 200 రోజులు పూర్తయిన సందర్భంగా సురేష్ నాయుడు కేక్ కట్‌చేశారు. 10 లక్షల మందికి అన్నదాన కార్యక్రమం పూర్తయిన సందర్భంగా మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి ప్రొద్దుటూరు సేవా రత్న బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఆకలి తీర్చిన ఘనత నారా చంద్రబాబునాయుడుదన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రొద్దుటూరు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన అన్న క్యాంటీన్‌కు ప్రొద్దుటూరులో విశేష ఆదరణ లభించిందన్నారు. ప్రతిరోజు క్యాంటీన్‌లో మూడు వేల మందికి, మూడు మొబైల్ వాహనాల ద్వారా మరో రెండువేల మందికి భోజనం అందించామన్నారు. ఇప్పటికి 200 రోజులు పూర్తి చేసుకొని పది లక్షలమందికి అన్నదానం చేయగలిగామనే సంతృప్తితో వున్నామన్నారు. మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ సురేష్ నాయుడు ఏదైనా మంచి పని చేయాలని తలిస్తే.. దానిని ఖచ్చితంగా పూర్తిచేసేదాకా నిద్రపోడన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ప్రజలకు సేవ చేయాలని ముందుకు వస్తున్న నాయకుడు సురేష్‌నాయుడన్నారు. ఆయనకు టిక్కెట్టు వస్తే ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. అనంతరం ముక్తియార్‌కు సిరిపురిరత్న బిరుదును ప్రదానం చేశారు. సురేష్‌నాయుడు తండ్రి మునిస్వామి నాయుడును సన్మానించారు. అన్నా క్యాంటీన్‌కు సేవలందించిన వంటమాస్టర్ శంకర్ న్యాయవాది ఈవీ సుదాకర్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ ఖలీల్, చెన్నయ్యకు సన్మానం చేశారు. కార్యక్రమంలో 19 వవార్డు కౌన్సిలర్ మునీర్, జనసేన ప్రోగ్రాం కమిటీ సభ్యులు జిలాన్, మన ప్రజా సేవా సమితి గౌరవ అధ్యక్షుడు , ఉపాధ్యక్షుడు బీటెక్ బాషా,సహాయకార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసం.. పోలీసులకు ఫిర్యాదు

కడప (క్రైం), ఫిబ్రవరి 26 : చీటీల పేరుతో తమ వద్ద డబ్బు వసూలు చేసి పారిపోయిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ కడపకు చెందిన పలువురు బాధితులు సోమవారం కడప డీఎస్పీ షరీఫ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. చిన్నచౌకు ప్రాంతానికి చెందిన పలువురు ఆ వ్యక్తి వద్ద లక్షల్లో చీటీలను వేశారు. అందరితో నమ్మకంగా ఉంటూ దాదాపు రూ. 30 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసుకుని పరారైనట్లు తెలుస్తోంది. దీంతో బాధితులు పెద్ద సంఖ్యలో కడప డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. అతనిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ డీఎస్పీకి విజ్ఞప్తిచేశారు.

మిస్టర్ ఆంధ్ర టైటిల్ భాస్కర్‌రావు కైవసం

● రన్నరప్‌గా కిశోర్.. బెస్ట్ పోజర్‌గా మెహరాజ్

● ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు



కప్‌లతో విజేతలు

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 26 : బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (బీబీఏపీ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్ (కళ్యాణమండపం)లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో విశాఖకు చెందిన భాస్కర్‌రావు చాంపియన్ ఆఫ్ ది చాంపియన్స్‌గా నిలిచి మిస్టర్ ఆంధ్ర టైటిల్ కైవసం చేసుకున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నూనె నగేశ్, షేక్ యూనుస్ బాషా వెల్లడించారు. రసవత్తరంగా సాగిన ఈ పోటీల్లో ఛాంపియన్ ఆఫ్ చాంపియన్స్ రన్నరప్‌గా విజయనగరానికి చెందిన కిశోర్ నిలిచారన్నారు. బెస్ట్ కోసర్‌గా కడపకు చెందిన మెహరాజ్ నిలబడడం విశేషమన్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఈ పోటీలకు సుమారు 300 మంది బాడీ బిల్డర్లు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వీక్షించారు. 15 కేటగిరిల్లో జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలోనే మొదటిసారిగా ఏడు బహుమతులు నగదు రూపంలో చెల్లించినట్లు తెలిపారు.

నటుల హంగామా: పోటీల మధ్యలో సినీనటులు రామ్‌జగన్, గీతాసింగ్, జబర్దస్త్ శాంతికుమార్, జంగిల్‌జీవన్, హరికృష్ణ, కార్తీక్‌ప్రసాద్ కామెడీషో, డ్యాన్స్‌లతో హంగామా చేశారు. శాంతికుమార్ మిమిక్రీకి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో జనవికాస్ సేవా సమితి నాయకులు తాహిర్, కార్పొరేటర్ షఫి, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఈవై కుమార్, కోశాధికారి రమేష్, మహిళా అధ్యక్షురాలు సీమా పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి: ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: స్పందన కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై సత్వరం స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ కృష్ణారావు జిల్లాలోని పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ స్పందన (గ్రీవెన్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నలుమూలల నుండి వచ్చిన 40 మంది ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం చేకూర్చాలన్నారు.

సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యల నివేదికలను ఎప్పటికప్పుడు పోలీసు ప్రధాన కార్యాలయానికి అందించాలని ఆదేశించారు.

అధిక ధరలకు మద్యం అమ్ముతున్నందుకు కేసు



మద్యం షాపును తనిఖీ చేస్తున్న సీఐ అన్నపూర్ణమ్మ

అట్లూరు, ఫిబ్రవరి 26 : ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.అన్నపూర్ణమ్మ తెలిపారు. ఏఈఎస్ చిత్తూరు విజిలెన్స్ వారి ఆదేశాల మేరకు సోమవారం ప్రభుత్వ మద్యం షాపులపై తనిఖీలు నిర్వహించామని ఆమె తెలిపారు. ఒక్కరికి మూడు మద్యం సీసాలు మాత్రమే విక్ర యించాలని, ఎక్కువ సంఖ్యలో విక్రయిస్తే సిబ్బందిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా సారాయి కానీ, కల్తీ మద్యం కానీ, , మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలుతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సిద్దయ్య భాను, శ్రీనివాస్ స్థానిక వలంటీరు పాల్గొన్నారు.

కడప విద్యార్థినికి పార్లమెంటులో ప్రసంగించే అవకాశం



మాట్లాడుతున్న సానియా (ఫైల్)

కడప (కల్చరల్), ఫిబ్రవరి 26 : భారత పార్లమెంటు భవనంలో ప్రసంగించే అరుదైన సువర్ణ అవకాశాన్ని కడపలోని ఎస్‌కేఆర్ కళాశాలకు చెందిన సయ్యద్ సానియాకు దక్కిందని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి కె.మణికంఠ తెలిపారు. సోమవారం స్థానిక బాలాజీనగర్‌లోని నెహ్రూ యువకేంద్రం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ వారు వర్చువల్ మోడ్‌లో జాతీయ యూత్ పార్లమెంటు ఫెస్టివల్ 2024 నిర్వహించిన సంగతి తెలిసిందే.. ఈ పోటీల్లో సానియా జాతీయ స్థాయికి చేరుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పార్లమెంటు భవనంలో ప్రసంగించే అవకాశాన్ని దక్కించుకుందన్నారు. చదువుకుంటూ మంచి వక్తగా రాణించడం ఆనందకరమన్నారు. సానియా ఎంపికను జిల్లా యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

ఏసీబీ డీఎస్పీగా గిరిధర్

కడప (క్రైం), ఫిబ్రవరి 26 : కడప జిల్లా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీగా వి.గిరిధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఈయన ప్రస్తుతం తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి నిరోధకానికి ప్రజల సహకారం ఉందన్నారు. ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్న వారి సమాచారం అందించాలని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకున్నందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు. ఎవరైనా అవినీతిపై సమాచారం ఇవ్వాల్సి ఉంటే 9440446191కు ఫోను చేసి సమాచారం అందించాలని కోరారు.

సాయిబాబా విగ్రహం అపహరణ



సాయిబాబా ఆలయం

ఖాజీపేట, ఫిబ్రవరి 26: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని సిద్ధాంతిపురం సమీపంలో ఉన్న సాయిబాబా గుడిలోని అభిషేక విగ్రహం అపహరణకు గురైంది. కమిటీవారి కథనం మేరకు ఏడు నెలల క్రితం ప్రసాద్‌శర్మ అనే వ్యక్తిని గుడిలో పూజారిగా పనిచేసేందుకు నియమించారు. నమ్మకంగా పూజా కార్యక్రమాలు చేస్తుండడంతో వెండిసామాన్లు ఆయనకు అప్పగించారు. అయితే శనివారం రాత్రి నుంచి పూజకు రాకపోవడంతో అనుమానంతో గుడిలో పరిశీలించగా అభిషేక విగ్రహంతో పాటు, ఇతర వస్తువులు కలిపి 10 కేజీల వెండి పోయిందనిపోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ కొణతల మోహన్ తెలిపారు.

పురోహితుడి అదృశ్యం



ప్రసాద్‌శర్మ

తన భర్త రెండు రోజులుగా కనిపించడం లేదని, ఖాజీపేటకు చెందిన హేమలత ఫిర్యాదు చేసినట్లు సీఐ రామాంజులు తెలిపారు. పౌరోహిత్యంతో జీవించే ప్ర సాద్ శర్మ మూడేళ్లుగా ఖాజీపేటలో నివాసముంటున్నాడు. పూజకు వెళ్లి వస్తానని శనివారం కడపకు వెళ్లిన అతను ఇప్పటికీ తిరిగిరాకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ వ్యక్తి కనపడితే 9121100623 కు సమాచారం అందించాలని తెలిపారు.

కర్ణాటక బస్సులో రూ. 9,68 లక్షలు సీజ్

కొండాపురం, ఫిబ్రవరి 26 : కేఎస్‌ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి నుంచి కొండాపురం పోలీసులు రూ.9,68,160లు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద సోమవారం కొండాపురం ఎస్సై యోగీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్‌ఆర్టీసీ బస్సులో గుత్తి నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న ప్రొద్దుటూరు దొరసానిపల్లెకు చెందిన వంశీకృష్ణ అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

పెద్దముడియం, ఫిబ్రవరి 26: కనుమలోపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫర్హానా (35) అనే వివాహిత అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు చిన్నముడియం సంత గేటు వీధికిచెందిన ఎస్. ముబారక్ భార్య ఫర్హానాతో కలసి ద్విచక్ర వాహనంలో కలిచెర్లకు వెళుతుండగా పెద్దముడియం నుంచి దోసకాయల లోడుతో వస్తున్న ఐచర్ వాహనంలో ఢీకొంది. దీంతో ఫర్హానా అక్కడికక్కడే మృతి చెందగా గాయ పడిన ముబారక్‌ను 108 వాహనంలో రాయచోటికి తరలించారు. పెద్దముడియం ఎస్ఐ చెన్నకేశవ సంఘటన స్థలం పరిశీలించారు. మృతురాలి బంధువులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఫర్హానా మృతదేహాన్ని రాయచోటి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తర లించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి దేవస్థానం

రామాపురం, ఫిబ్రవరి 26: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు శ్రీమహాగణపతి, సుబ్రహ్మణేశ్వర, హనుమాన్, సమేత శ్రీసీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు, ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు మాట్లాడుతూ 27న మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల్లోపు గణపతిపూజ, స్వస్తివాచకం, మాతృకపూజ, రక్షాబంధనం, ప్రధాన కలశ స్థాపన, తదితర పూజా కార్యక్రమాలు, 28న ఉదయం ప్రాతఃకాల పూజ, గ్రామోత్సవం, గణపతిహోమం, వాస్తు హోమం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, 29న ఉదయం 9 నుంచి ప్రాతఃకాలపూజ, ప్రతిష్ఠ హోమం, శాంతి పౌష్టిక హోమాలు, తీర్థప్రసాదాల వినియోగం ఉంటాయని కార్యనిర్వాహకులు తెలిపారు.

పాత పెన్షన్‌పై హామీ ఇచ్చే వారికే మా ఓటు

● యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: ఉద్యోగ, ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.జాబీర్ ఆక్షేపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సైతం ప్రభుత్వంలో భాగమేనని గుర్తించి వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక అలీమాబాద్‌వీధిలో గల ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్లెట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు ఇవ్వని పక్క రాష్ట్రాలు సైతం పాత పెన్షన్ విధానం వైపు అడుగులు వేస్తుంటే ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సీఎం జగన్ ఉద్యోగులను మోసగిస్తుండటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాయచోటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హఫీజుల్లా, రాజారమేశ్, సీపీఎస్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు చాన్‌బాషా, మండల కన్వీనర్ రాజబాబు, రాంమోహన్‌రెడ్డి, ఇలియాస్, జగదీశ్, మహమ్మద్‌బాషా, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పొలిట్ బ్యూరో సభ్యుడిని కలిసిన పలువురు



శ్రీనివాసరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 26: పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిని మండలంలోని పలువురు టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కడప టీడీపీ అభ్యర్థిగా ఆయన సతీమణి మాధవిని ప్రకటించడంతో మండలంలోని టీడీపీ సీనియర్ నాయకుడు కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో ఉదయం ఆయన కార్యాలయంలో గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, ప్రతి కార్యకర్త నడుం బిగించి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు, మునిరత్నం, బాలాజీ, మోదుగుల నరసింహులు, మోదుగుల హరి, హరినాథ్‌రెడ్డి, రంతుల్లా, శ్రీనివాసులు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని ఓడించాలి

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న నాగోతు రమేశ్ నాయుడు, సాయిలోకేశ్

సుండుపల్లె, ఫిబ్రవరి 26: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజా పోరు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సిద్ధం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకొని మరో మారు ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారని, వైసీపీని ఓడించేందుకు రాష్ట్ర ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని తెలియపరిచారు. అన్నమయ్య డ్యామ్, పింఛా ప్రాజెక్టులు తెగిపోయి నియోజకవర్గంలోని రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తాము ప్రజలకు మంచి చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుబ్బరాజు, జిల్లా నాయకులు వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

రాజంపేట, ఫిబ్రవరి 26: రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జయలక్ష్మీ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చక్కగా విని రాబోవు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. విలువలతో కూడిన విద్యనభ్యసించి సమాజానికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు రమణ, సుబ్రమణ్యం, సరిత, రమణయ్య, శ్రీవిద్య, ప్రసన్నలక్ష్మీ, శ్రీనివాసులు, నరేష్ తదితర ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జే ట్యాక్స్ డబ్బుతోనే.. వైసీపీ ఖర్చు

● నాసిరకం మద్యంతో లక్షలాది మందికి అనారోగ్యం
● నాయకులందరినీ కలుపుకుని.. విజయం సాధిస్తాం
● రాయచోటి టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఇసుక, మద్యం అమ్మకాలపై వసూలు చేసిన జే ట్యాక్స్ డబ్బును.. రాబోయే ఎన్నికల్లో ఖర్చు చేసి విజయం సాధించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎస్ఎన్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మన రాష్ట్రంలో మద్యంలో జరిగినంత దోపిడీ దేశంలోనే మరెక్కడా జరగలేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. గత 57 నెలలుగా రాష్ట్రంలో నాసిరకం మద్యం తాగి... లక్షలాది మంది అనార్యోగం పాలై.. పక్క రాష్ట్రాల్లో చికిత్స పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి సరఫరా విచ్చలవిడిగా జరుగుతోందని ఆరోపించారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుపుకుని.. ఎన్నికల్లో పనిచేసి విజయం సాధిస్తానన్నారు. ప్రస్తుతం ఏదైనా దుకాణంలో కనీసం రూ.5 పెట్టి కొన్నా.. ఫోన్‌పే, గూగుల్ పే వంటి డిజిటల్ ట్రాన్సాక్షన్ జరుగుతున్నా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం దుకాణాల్లో మాత్రం నగదు ద్వారానే మద్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ఎటువంటి దోపిడీ చేయకపోతే. ఇలా ఎందుకు చేస్తున్నారో ? ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తనను రాయచోటి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు.. చంద్రబాబు, నారా లోకేశ్, పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీకి గత నలభై సంవత్సరాలుగా అండగా ఉంటూ వస్తున్న.. కార్యకర్తలు, నాయకులను ముందు వరుసలో పెట్టుకునే రాజకీయం చేస్తానన్నారు. కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా.. చూసుకుంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో గత 57 నెలల నుంచి జగన్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కంటే, జరిగిన అక్రమాలే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు.

పలువురు పార్టీలో చేరిక

సంబేపల్లె మండలం అడవికమ్మపల్లెకు చెందిన వైసీపీ ఎంపీటీసీ రామరాజు, అధికార పార్టీ దుద్యాల సర్పంచ్, పట్టణానికి చెందిన వైసీపీ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బాషలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీళ్లందరికీ రాంప్రసాద్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అధికార పార్టీలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు టీడీపీలో చేరాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లగా ఎన్నో పనులు శంకుస్థాపన దశలోనే ఆగిపోయాయని విమర్శించారు. గ్రామాలలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు మాత్రమే నిర్మించారని, వాటితోనే అభివృద్ధి జరిగిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలోని 175 నియోకజకవర్గాలలో వెనుకబడిన ప్రాంతంగా రాయచోటి చివరి పది స్థానాల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు అభివృద్ధి విషయమై స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని ప్రజలు నిలదీయాలన్నారు. ఎమ్మెల్యే అండ్ కో గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో రూ.300 కోట్లు మాయం చేశారని ఆరోపించారు. జగనన్న కాలనీల్లో ఇస్తున్న ఇళ్లలో ఒక కుటుంబం ఎలా జీవించగలరో చెప్పాలన్నారు. అనంతరం పలువురు సీనియర్ టీడీపీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శశిధర్‌రెడ్డి, నాగేశ్వర్‌నాయుడు, కాటమయ్య, మాజీ ఎంపీటీసీలు రామరాజు, మాజీ ఎంపీటీసీ బలరాం, మాజీ కౌన్సిలర్ రాంమోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ విజయ్, రాయచోటి శివప్రసాద్‌రెడ్డి, రమేశ్, మాజీ సర్పంచ్ గురవయ్య, సిద్దారెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, మదన్, మాజీ ఎంపీటీసీ, మైనార్టీ నాయకులు షేక్షావలి, సహదేవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామచంద్ర, సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రూ.50 వేలు ఆర్థిక సాయం

గాలివీడు, ఫిబ్రవరి 26: గాలివీడు పంచాయతీ చిలకలూరిపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కోటకొండ వెంకట్రమణ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకొని వెంకట్రమణ మృతదేహానికి ఘన నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి పిల్లలను స్వర్గీయ మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ద్వారా తాను చదివిస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతం దహన సంస్కారాల కోసం రూ.50 వేలు మృతుడి భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యత లేకపోతే సీజ్ చేస్తాం

● మున్సిపల్ అండ్ ఫుడ్ సేఫ్టీ అధికారుల హెచ్చరిక

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: రాయచోటి పట్టణంలో గల హోటళ్లు, టిఫెన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఆహారం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే హోటళ్లను సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి షమీంబాషాలు హెచ్చరించారు. సోమవారం వారు రాయచోటి పట్టణంలోని పలు హోటళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని సుండుపల్లె రోడ్డులో గల ఉమా టిఫెన్ సెంటర్‌లో తక్కువ మైక్రాన్‌లు కలిగి ప్రజారోగ్యానికి హాని చేసే ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి రూ.5 వేలు జరిమానా విధించడంతో పాటు కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

● డైట్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: విద్యార్థి దశ నుంచే వస్తువుల నాణ్యత, ప్రమాణాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని డైట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి పేర్కొన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (భారతీయ ప్రమాణాల సంస్థ) విజయవాడ శాఖ వారి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక డైట్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువు ఆహార పదార్థాలను ఎలా ఎంపిక చేసుకోవాలో, అందులో ఉన్న నాణ్యత ప్రమాణాల గురించి తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. అనంతరం జిల్లా ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, పాఠశాల క్లబ్ మెంబర్ గోవిందు నాగరాజు మాట్లాడారు. అనంతరం మొదటి, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోకేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఫణీంద్ర, తౌఫిక్‌అలీ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మతల్లి వార్షికోత్సవం

చిట్వేలి, ఫిబ్రవరి 26: చిట్వేలి బ్రాహ్మణవీధిలో వెలసియున్న మారెమ్మ తల్లి మొదటి వార్షికోత్సవం సోమవారం ఉయ్యాలసేవతో ఘనంగా ముగిసింది. ఈ మేరకు మైలపల్లి వడ్డిపల్లె గ్రామస్తుడు తమ్మిశెట్టి నాగేశ్వరరావు ఉత్సవ విగ్రహాన్ని సమర్పించారు. సోమవారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించగా సాయంత్రం 7.30 గంటలకు ఉయ్యాలసేవను ఘనంగా నిర్వహించారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన బాధితులు

పెనగలూరు, ఫిబ్రవరి 26: మండలంలోని సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని పందికాళ్ల నారాయణకు సంబంధించిన భూమిలో ఆదివారం రౌడీమూకలు సృష్టించిన అరాచకాల గురించి సోమవారం దళిత రైతులు కలెక్టర్‌కు, ఎంపీకి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ పూర్తి వివరాలు తెలపాలని స్థానిక తహశీల్దారుకు ఆదేశించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఎస్పీని కలిసినప్పుడు... భూమిలో జరిగిన రౌడీయిజంతో కలిగించిన నష్టాన్ని, 50 మంది రౌడీలు ఎక్కడి నుంచి వచ్చారు ? ఎవరు పిలిపించారు ? ఎవరి ఆదేశంతో ఇది జరిగిందనే వివరాలన్నీ తనకు తెలపాలని ఎస్పీ ఆదేశించినట్లు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సుండుపల్లె,ఫిబ్రవరి26: మండల కేంద్రానికి సమీపంలోని బలిజపల్లె గ్రామంలో వెలసిన కొత్తపురమ్మ ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి కొత్తపురమ్మ, ఇరుగులమ్మ, మూలకాలయల్లమ్మల ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గణపతిపూజ, నవగ్రహపూజ, కలశస్థాపన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామాశ్రీనివాస్, గ్రామస్తులు సిద్దయ్య, నాగయ్య, శివశంకర్, వీరనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన రామ్మోహన్



చంద్రబాబును కలిసిన రామ్మోహన్

సుండుపల్లె, ఫిబ్రవరి 26: మాజీ సీఎం చంద్రబాబునాయుడును సోమవారం ఉండవల్లిలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి రామ్మోహన్ కలిశారు. వైసీపీ పాలనలో అక్రమ కేసులతో వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. టీడీపీలో యువతకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నట్లు, ప్రతి యువకుడు టీడీపీ గెలుపుకు కృషి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అక్రమ కేసులు ఎదుర్కొంటున్న ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సర్పంచ్‌గా రామాంజనేయులు



నూతన సర్పంచ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీడీవో

వీరబల్లి, ఫిబ్రవరి 26: సంఘంవాండ్లపల్లె నూతన సర్పంచ్‌గా సోమవారం రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న సర్పంచ్ దయ్యాల కృష్ణయ్య పదవి నుంచి తప్పుకున్నారు. ఎన్నికల్లో జరిగిన వీరి ఇరువురి ఒప్పందం మేరకు రెండున్నర సంవత్సరం ఒకరు మరో రెండున్నర సంవత్సరం ఒకరుగా నాయకుల సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు దయ్యాల కృష్ణయ్య పదవి నుంచి తప్పుకున్నారు. ఎంపీడీవో రామచంద్రారెడ్డి, రామాంజనేయులకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాన్ని పరామర్శించిన నేతలు



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ఐరిస్ గ్రాండ్ హోటల్ సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నిలబడి ఉన్న లారీని వెనుకవైపు నుంచి స్కూటర్ ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన డేగల లక్ష్మిభవాని (25), కుమార్తె డేగల వినితి (5), బావ కుమారుడు డేగల కృష్ణబాబు (21) ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మృతుల కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మృతదేహాలను సందర్శించి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు రాయచోటి ఏరియా ఆసుపత్రికి చేరుకొని మృతదేహాలను సందర్శించడంతో పాటు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: కురబలకోట మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని, భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సాంబశివ డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వోకు వినతి పత్రం అందజేశారు. కురబలకోట మండలంలోని రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భూఆక్రమణలు జరుగుతున్నాయని విమర్శించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి: సీపీఐ



కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ఇందిరమ్మ కాలనీ వాసులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా ఇందిరమ్మ కాలనీలోని 200 మందికి తీవ్రమైన తాగునీటి సమస్య ఉందని, అనేక దఫాలుగా స్థానిక ప్రజాప్రతినిధులకు, మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, సీపీఐ పట్టణ నాయకులు పుల్లయ్య, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు సురేంద్ర, మహిళలు పాల్గొన్నారు.

రైతులపై లాఠీచార్జి దారుణం : రైతుసంఘం



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: రైతులను మోదీ ప్రభుత్వం లాఠీచార్జీ, ప్లాస్టిక్ బుల్లెట్లతో కాల్చడం హేయమైన చర్య అని ఏపీ రైతు సంఘం నాయకులు అన్నారు. సోమవారం రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చని నేపథ్యంలో రెండవ దఫా రైతాంగం పోరాటాన్ని ప్రారంభించారని తెలిపారు. హర్యానా, ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై కాల్పులు జరిపి యువరైతు మరణానికి కారణమైన హర్యానా పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగులయ్య, రమణయ్య, ప్రసాద్, వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు లిస్టులోని లోపాలను సరిచేయాలి

● ఎన్నికల అధికారికి టీడీపీ నేతల ఫిర్యాదు



ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 26: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు లిస్టులో ఉన్న లోపాలను వెంటనే సరిచేయాలని సోమవారం టీడీపీ నాయకులు రైల్వేకోడూరు తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి టి.లీలారాణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 252 పోలింగ్ కేంద్రాల్లో ఏ ఒక్క బీఎల్ఓలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించలేదని తెలిపారు. ఒక పోలింగ్ పరిధిలోని ఓటర్లను మరో పోలింగ్ పరిధిలోకి తరలించారని, వారు ఓటు వేయాలంటే సుమారు 5 కి.మీ. వెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పెద్దూరు రాజా, పుల్లంపేట, కోడూరు మండల అధ్యక్షులు కొమ్మ శివ, ఎస్సీ నాయకులు చిన్న, రమేష్ పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి చెరువును కాపాడండి

● సీపీఐ నాయకులు



మురికి నీటిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 26: మంగంపేట పునరావాస గ్రామాల మురుగు నీటిని గోవిందమ్మ కుంటకు విడిచి కాలుష్యం చేస్తున్నారని సీపీఐ నాయకురాలు చింతలపూరి నాగమ్మ ఆధ్వర్యంలో ఏపీఎండీసీ చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగంపేట పునరావాస గ్రామాల నుంచి వస్తున్న మురికి నీటి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఏపీఎండీసీ బెరైటీస్ ఖనిజం మంగంపేటలో లభిస్తున్నదని, దీని వల్ల సంస్థ వేల కోట్ల లాభం పొందుతున్నదన్నారు. కాగా మంగంపేట ఆర్‌ఆర్ సెంటర్ల మురికి నీటిని గోవిందంపల్లె చెరువులోకి విడవడంతో పంచాయతీలో ఉన్న సుమారు 11 గ్రామాల ప్రజలు కలుషిత నీటిని తాగి ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. మురికి నీరంతా గోవిందంపల్లె చెరువులోకి రావడంతో గ్రామ పంచాయతీలో బోర్లలోకి నీరు ఇంకి రావడం వల్ల ఆ కలుషిత నీరు తాగడంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేస్తామని తెలిపారు. అనంతరం సీపీవో సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి కృష్ణవేణి, సీపీఐ నాయకుడు గోపాల్ పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటసారి.. చంద్రబాబు



ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్న అనితా దీప్తి

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 26: రాష్ట్ర భవిష్యత్తుకు బాటసారి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ మహిళా నాయకురాలు దుద్యాల అనితా దీప్తి తెలిపారు. సోమవారం టీడీపీ ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మండలంలోని ఓబునపల్లె గ్రామ పంచాయతీలోని అరుంధతి వాడలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో ప్రజలకు అందే సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, వెంకటయ్య, మణి, మందా నాగేశ్వర రావు, మామిళ్ల రామయ్య, మిట్టవీధి మధు, నగరిపాటి సంతోష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

పుల్లంపేట, ఫిబ్రవరి 26: మండల పరిధిలోని కొమ్మనవారిపల్లె పంచాయతీ చొప్పావారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులకు గ్రామోత్సవం నిర్వహించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు



గుట్టపాళ్యం, గూబలవారిపల్లె సమీపంలో పొలాల్లో ఏనుగుల పాదముద్రలు, ధ్వంసమైన వరి

పాకాల, ఫిబ్రవరి 26: పాకాల, ఐరాల మండలాల సరిహద్దులో మొరవపల్లె, కాకర్లవారిపల్లె, గుట్టపాళ్యం, గూబలవారిపల్లె, వేదగిరివారిపల్లె సమీపంలోని పంట పొలాలపై ఆదివారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. గూబలవారిపల్లెకు చెందిన సేతురాం, వేదగిరివారిపల్లెకు చెందిన శివాజి, గుట్టపాళ్యంకు చెందిన విజయ నాయుడులకు చెందిన వరి పొలాలను తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. గుట్టపాళ్యం విజయ నాయుడు వరి పొలంవద్ద నున్న బావిలో ఓ గున్న ఏనుగు పడిపోగా.. దానిని రక్షించి పెద్ద ఏనుగులు తీసుకెళ్లిపోయిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రదేశమంతా ఏనుగులు తొక్కేయడంతో వరి పంట ధ్వంసమైంది. పంట పొలాలపై కొన్ని నెలలుగా వరుస దాడులతో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నా.. సంబంధిత అటవీ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏనుగుల బెడద తప్పించాలని రైతులు కోరుతున్నారు.

'పద్మావతి' ఆస్పత్రిలో 1 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు

- తిరుమలలోని క్యాంటీన్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి రాయితీపై అల్పాహారం, భోజన సదుపాయం
- తిరుపతిలో రూ.7.51కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం
- టీటీడీ ఛైర్మన్ భూమన



టీటీడీ బోర్డు సభ్యులతో సమావేశమైన ఛైర్మన్ కరుణాకరరెడ్డి

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో మార్చి ఒకటినుంచి ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రోగులకు నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, మానసిక వ్యాధులు, పీడియాట్రిక్ వంటి ప్రత్యేక విభాగాలతోపాటు జ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి సాధారణ వ్యాధులకూ వైద్యసేవలు అందిస్తారన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యులతో కలిసి బోర్డు నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. టీటీడీలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీల్లోని సిబ్బందికి, వర్క్ కాంట్రాక్ట్ పరిధిలోని ఎఫ్ఎంఎస్, పారిశుధ్య సిబ్బందికి తిరుమలలోని ఉద్యోగుల క్యాంటీన్‌లో రాయితీపై అల్పాహారం, భోజన సదుపాయం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఉద్యోగుల క్యాంటీన్‌లో వంటశాల, భోజనశాల విస్తరణకు రూ.8.15 కోట్లు, అవసరమైన వంట సామగ్రి కొనుగోలుకు రూ.3కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు. అన్నప్రసాద విభాగంలో సూపర్‌వైజరీ పోస్టుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు నిర్ణయించామని, అలాగే కిందిస్థాయి పోస్టులను కార్పొరేషన్ లేదా ఔట్‌సోర్సింగ్ ద్వారా నియామకానికి ఆమోదం తెలిపామని చెప్పారు.

తిరుమలలో దాదాపు 30 ఏళ్ల క్రితం గడువుచెల్లిన హాకర్ లైసెన్సు రెన్యువల్స్, దుకాణాల స్థల మార్పిడి అంశాలను

హాకర్ లైసెన్సు రెన్యువల్స్‌పై..?

కూడా బోర్డు అజెండాలో పొందుపరిచినట్టు తెలిసింది. అయితే వీటిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారనే విషయం బయటకు వెల్లడికాలేదు.

మరికొన్ని నిర్ణయాలివీ..

- టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి పుట్టినరోజును ప్రతి ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన నిర్వహించాలని నిర్ణయం. టీటీడీ క్యాలెండరులోనూ ఈ రోజును చేర్చాలని తీర్మానం.
- టీటీడీ అటవీ విభాగంలో విధులు నిర్వహిస్తూ శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్‌లో ఉన్న ఉద్యోగులను తిరిగి వారి సొసైటీలకు బదిలీ చేసి, వేతనాలు పెంచి, బస్సు పాసులు ఇచ్చేందుకు ఆమోదం.
- వడమాలపేట పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్లస్థలాల లేఔట్, ఇతర అభివృద్ధి చార్జీలకు సంబంధించి రూ.8.16 కోట్లు తుడాకు చెల్లించేందుకు ఆమోదం. ఈమొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు.
- శ్రీలంకలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహణకు నిర్ణయం.
- తిరుమలలోని సప్తగిరి విశ్రాంతి భవనంలో 1, 4వ బ్లాకుల ఆధునికీకరణకు రూ.3.19 కోట్లు మంజూరుకు ఆమోదం.
- పాపవినాశనం, కుమారధార, పసుపుధార, ఇతర ప్రాంతాల్లోని 682 మోటార్ పంపు సెట్ల స్థానంలో కొత్తవాటి ఏర్పాటుకు రూ.3.15 కోట్ల మంజూరు.
- తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అతిథి భవనాలు, పీఏసీలో ఎఫ్ఎంఎస్ సేవలు మరో మూడేళ్ల పొడిగింపు.
- తిరుపతిలోని శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవర్లకు నూతన బంగారు కవచాల తయారీకి ఆమోదం. రూ.15లక్షలతో రెండు తండ్లకు బంగారు మలాం వేసిన కాపర్ రేకులు ఏర్పాటు.
- తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గత ఏడాది తరహాలోనే జాతర నిర్వహణకు రూ.50లక్షల మంజూరుకు ఆమోదం.
- టీటీడీ ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణ పూర్ణ ప్రసాద్ పదవీ కాలం మరో మూడేళ్ల పొడిగింపు.
- జమ్మూలో నిర్మించిన శ్రీవారి ఆలయంలో పనిచేసే సిబ్బందికి హెచ్ఆర్ఏ పెంపునకు ఆమోదం.
- తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులో ఇన్‌కమ్ ట్యాక్స్ గెస్ట్ హౌస్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో రూ.7.51 కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆమోదం.
- అలిపిరి కాలినడక మార్గంలో గాలిగోపురం, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దనున్న ముగ్గుబావుల ఆధునికీకరణకు నిర్ణయం.

జగన్ సభకు మృతుల పేర్లు



చనిపోయిన గంగాధరం, సిపాయి పేర్లతో జాబితా

పెనుమూరు, ఫిబ్రవరి 26: కుప్పంలో సోమవారం జరిగిన సీఎం జగన్ సభకు ప్రతి మండలం, పంచాయతీ నుంచి జనాలను అధికారులు, నాయకులు తరలించారు. ఇందులో భాగంగా పెనుమూరు మండలం నుంచి ఎనిమిది బస్సులను కేటాయించి ఒక్కో సచివాలయానికి ఒక్కో సచివాలయ అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సభకు వెళ్లే వారి వివరాలను ముందు రోజే సిద్ధం చేసి మండల స్థాయి అధికారులకు అందించారు. ఇందులో పులికల్లు సచివాలయ పరిధిలోని గొడుగుమానుపల్లి దళితవాడలో గంగాధరం, సిపాయి ఎప్పుడో మరణించారు. కుప్పం సభకు వీరి పేర్లను కూడా నమోదు చేశారు. అలాగే టీడీపీ కార్యకర్తల పేర్లను కూడా ఇందులో నమోదు చేయడంతో వారు తమ పేర్లను ఎవరు రాశారు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలా.. సభకు జనాలు రాకపోవడంతోనే లేనివారి పేర్లు, టీడీపీ నేతల పేర్లు నమోదు చేసి మమ అనిపించారని విపక్షాలు విమర్శించాయి.

అండర్ రైల్వే బ్రిడ్జి ప్రారంభం



శిలాఫలకం వద్ద బీజేపీ నేతలు

పెనుమూరు: పెనుమూరు క్రాస్‌లో రూ.3 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్‌బ్రిడ్జిని సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వాసుదేవ నాయుడు, జిల్లా కార్యదర్శి జీకే చౌదరి, పూతలపట్టు మండలాధ్యక్షుడు నరసింహులు నాయుడు, రైల్వే అధికారులు మధుసూదనయ్య, వేణుమాదవ్, ఉదయరామసింగ్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పులి దాడిలో మేక మృతి



మృతి చెందిన మేక

చౌడేపల్లె, ఫిబ్రవరి 26: పులి దాడిలో మేక మృతి చెందిన ఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన ప్రకారం.. కేతనపల్లెకు చెందిన నాగరాజ తన మేకలను గ్రామ సమీపంలో మేపుతున్నారు. ఆ సమయంలో పులి మేకలపై దాడి చేసింది. ఈ దాడిలో ఓ మేక అక్కడిక్కడే మృతి చెందింది. పులి దాడి చేయడం చూడగానే ఆ రైతు భయభ్రాంతులకు గురయ్యారు. నెల రోజుల్లో 4 మేకలు, ఒక పాడి ఆవు కూడా మృతి చెందినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. సమాచారం ఇచ్చినా ఆటవీశాఖ అధికారులు స్పందిచలేదని గ్రామస్తులు తెలిపారు.

పాకాల రైల్వేకాలనీలో దారుణ హత్య

- తలపై బండరాయితో మోది చంపేశారు



పాకాల, ఫిబ్రవరి 26: పాకాల రైల్వే కాలనీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ సమీపంలో చింతచెట్ల కింద పాకాల పోలీస్‌స్టేషన్‌కి కూతవేటు దూరంలో ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తిని తలపై బండరాయితో మోది చంపినట్లు స్థానికులు సోమవారం ఉదయం గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాకాల ఎస్ఐ2 ఇషాక్ బాషా, రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుందని ప్యాంటు, షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. వ్యక్తిగత ఆధారాలేమీ లభ్యం కాలేదన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో పర్సు, సెల్‌ఫోను చోరీ

- ఫిర్యాదు చేసినాపట్టించుకోని పోలీసులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 26: తిరుపతిలోని ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు అనంతరం చికిత్స పొందుతున్న మహిళ పర్సు, సెల్‌ఫోను చోరీకి గురయ్యాయి. ఈ విషయమై బాధితులు మూడు రోజుల క్రితం వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బాధితుల వివరాల మేరకు.. రొంపిచెర్లకు చెందిన షేక్ అస్మిత కాన్పు కోసం ఈనెల 21న స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వచ్చింది. మరుసటి రోజునే కాన్పు కావడంతో ఆస్పత్రిలోనే ఉంటూ చికిత్స పొందుతుంది. 22వ తేదీ రాత్రి వార్డులో నిద్రిస్తున్న క్రమంలో పడక పక్కనే ఉన్న పర్సు, సెల్‌ఫోను కనిపించకపోవడంతో వెంటనే విషయాన్ని ఆస్పత్రిలోని సెక్యూరిటీ సిబ్బందికి దృష్టికి తీసుకువచ్చింది. వారు నిర్లక్ష్యంగా మాట్లాడటంతో బాధితులు 23 తేదీన వెస్ట్ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించకపోగా ఇంత చిన్న దానికే ఫిర్యాదు ఏమిటని ఉచిత సలహాలు ఇచ్చారు. ఫోన్‌లో విలువైన సమాచారం ఉందని, పర్సులో రూ.ఐదు వేల వరకు నగదు ఉందని విన్నవించినా పట్టించుకోలేదు. తెలిసిన వారి సాయంతో సోమవారం సాయంత్రం మరోసారి స్టేషనుకు వెళ్లడంతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. కానీ కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

వరాహస్వామిని దర్శించుకున్న శశికళ



తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం జయలలిత స్నేహితురాలు శశికళ శ్రీవారి దర్శనార్థం సోమవారం రాత్రి తిరుమలకు వచ్చారు. రచన అతిథి గృహానికి చేరుకున్న ఆమె క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న వరాహస్వామిని దర్శించుకున్నారు. తిరిగి అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 26: దేశవ్యాప్తంగా 72 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వీటిలో చిత్తూరు రైల్వే స్టేషన్ కూడా ఉంది. రూ.13.99 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ తిరుపతి వరకే ఉండేదని, తాను చిత్తూరు ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి రైల్వే మంత్రి బండారు దత్తాత్రేయతో మాట్లాడి చిత్తూరు వరకు రప్పించామన్నారు. గుంతకల్లు సీనియర్ డివిజనల్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో బీజేపీ నేతలు, రైల్వే అధికారులు



చిత్తూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ నమూనా

సేఫ్టీ ఆఫీసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ రైల్వే స్టేషన్లను ఆధునికీకరణ పనులన్నీ సంవత్సరంలోపు పూర్తి అవుతాయన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు రైళ్లల్లో ప్రయాణాలు బాగా పెరిగాయని, అందుకు తగ్గట్టుగా స్టేషన్లలో సౌకర్యాలు లేవన్నినరు. అందుకనే అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు ప్రధాని శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, చిత్తూరు స్టేషన్ మాస్టర్ ముత్తుస్వామి, వాణిజ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, జీఆర్‌పీ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సీపీఐ నాయకుడు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

18మందికే జీతాల పెంపు అన్యాయం

అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి : పీస్‌రేట్ క్షురకుల డిమాండ్



ధర్నా చేస్తున్న కల్యాణకట్ట క్షురకులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 26: పీస్‌రేట్ క్షురకులకు రూ.20వేలు జీతం పెంచుతూ పాలకమండలిలో తీసుకున్న నిర్ణయం 826మందికి గాను కేవలం 18మందికే వర్తింపజేయడం అన్యాయమని శ్రీవారి కల్యాణకట్ట నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరి, ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీవారి కల్యాణకట్ట పీస్‌రేట్ క్షురకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఉదయం టీటీడీ పరిపాలన భవనం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పీస్‌రేట్ క్షురకులపై కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం దారుణమన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తున్నారన్న కారణంగా కొంతమందిని విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెప్ట్ ఆన్ డ్యూటీ(కేవోడీ) పేరిట పదేపదే క్షురకులను విధుల నుంచి తొలగించే విధానాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని కోరారు. కోర్టుకు వెళ్లారనే సాకుతో తిరుమల తిరుపతి మధ్య రద్దు చేసిన బస్సు పాసులను పునరుద్ధరించాలని, శాశ్వత ఉద్యోగులతో సమానంగా బ్రహ్మోత్సవ బహుమానం వర్తింపచేయాలని కోరారు. కార్పొరేషన్‌లో చేరమని బలవంతం చేయడం తగదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్షాల నేతలు సంఘీభావం తెలిపారు.

మాట ఇచ్చి మడమ తిప్పేశారు

- తొలుత చెప్పిన చోటే జగనన్న స్థలాలు ఇవ్వాలి
- సీపీఎం భూ పోరాటం



సీపీఎం నాయకులు, లబ్ధిదారులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 26: జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలను సాధించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మంగళం పరిధిలోని బీటీఆర్ కాలనీ నుంచి లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు భూపోరాట ర్యాలీ చేపట్టారు. గతంలో లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పి న భూమి వద్దకు ర్యాలీ చేరుకోగానే తిరుచానూరు పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భం గా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడతూ నాలుగున్నర సంవత్సరాల క్రితం ప్రస్తుత సర్వే అకాడమీకి కేటాయించిన భూమిలో ఉమ్మడి మంగళం పంచాయతీలో పేదలకు జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు సిద్ధం చేస్తున్నామని నాయకులు ప్రగల్భాలు పలికారన్నారు. అనంతరం ఆ భూమిని సర్వే అకాడమీకి కేటాయించారని, దీంతో లబ్ధిదారులందరికీ చిందేపల్లి వద్ద స్థలాలు ఇస్తున్నామని చెప్పారని గుర్తుచేశారు. ఆ మాట చెప్పి కూడా సంవత్సరాలు గడిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా స్థలాలు చూపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికంగా ఉన్న పేదలకు స్థానికంగానే స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవనోపాధికి కూడా అనువుగా లేని ప్రదేశాల్లో స్థలాలు చూపడం దారుణమైన విషయం అన్నారు. గతంలో ఇచ్చిన హామీని నిలెట్టుకోవాలని ఆ స్థలాల్లోనే లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని అప్పటి వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సీపీఎం నేతలు, లబ్ధిదారులు భూమి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుతో పాటు పలువురిని బలంతంగా అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు మాధవకృష్ణ, శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్ లక్ష్మి, నగర కమిటీ నాయకులు బుజ్జి, రవి, వెంకటేష్‌లపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కొంతమంది లబ్ధిదారులను కూడా అదుపులోకి తీసుకున్నారు. అయితే వారిని విడిచిపెట్టారు. కాగా లబ్ధిదారులను, సీపీఎం నాయకులను అక్రమ అరెస్టును నిరసిస్తూ సీపీఎం నాయకులు తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వద్ద సాయంత్రం ధర్నా చేపట్టారు. సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ ధర్నాలో సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, నేతలు జయచంద్ర, సాయిలక్ష్మి, బీటీఆర్ కాలనీకి చెందిన జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఎం నాయకుల అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. స్థానికంగానే లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రులు మందలించారని..

- ఇంటి నుంచి వచ్చేసిన విద్యార్థులు
- తిరిగి అప్పగించిన తిరుమల పోలీసులు



తిరుమల పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులు

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు మందలించడంతో ఇద్దరు విద్యార్థులు ఇంటి నుంచి తిరుమలకు వచ్చారు. వారిని తిరుమల టూటౌన్ పోలీసులు గుర్తించి తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ వివరాల మేరకు.. తిరుమలలోని ఏఎన్సీ ప్రాంతంలో సోమవారం ఉదయం అనుమానితంగా తిరుగుతున్న ఇద్దరు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తమ పేర్లు నారాయణ, మణి అని, మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రులు తిట్టడంతో నల్గొండ నుంచి తిరుమలకు వచ్చామని వివరించారు. దీంతో పోలీసులు వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ముక్కంటి సేవలో రష్యా భక్తులు



రాహు-కేతు పూజల్లో పాల్గొన్న రష్యన్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: ముక్కంటి ఆలయాన్ని సోమవారం రష్యా భక్తులు దర్శించుకున్నారు. 15 మంది రష్యా భక్తులు ముందుగా ఆలయంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలను జరిపించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ మంత్ర ముగ్ధులయ్యారు. ఆలయంలోని పగడ చెట్టు వద్ద బయట నుంచి శివ నామ స్మరణ చేశారు. స్థానిక భక్తులు విదేశీయులతో సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 26: పెద్దమండ్యం -చిన్నమండ్యం రహదారి కనుమలోపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫర్హానా (35) అనే వివాహిత అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు చిన్నమండ్యం సంతగేటు వీధికి ఎస్. ముబారక్ భార్య ఫర్హానాతో కలసి పెద్దమండ్యం మండలం కలిచెర్లకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. పెద్దమండ్యం నుంచి దోసకాయల లోడుతో ఐచర్‌వాహనంలో కనుమలోపల్లి సమీపంలో ఎదురుఎదురుగా వచ్చిన వాహనాలు ఢీకొనడంతో ఫర్హానా అక్కడిక్కడే మృతి చెందగా గాయపడిన ముబారక్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటికి తరలించారు. సమాచారం అందుకున్న పెద్దమడ్యం ఎస్‌ఐ చెన్నకేశవ సంఘటన స్థలం చేరుకొని పరిశీలించారు. మృతురాలి బంధువులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవ పరీక్షలు నిమిత్తం ఫర్హానా మృతదేహాన్ని రాయచోటి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన బాధిత కుటుంబం శోకసముద్రంలో మునిగి పోయాయి. చిన్నమండ్యంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జాతరలో టీడీపీ బ్యానర్లు ధ్వంసం



సీటీఎం క్రాస్‌రోడ్డు వద్ద దుండగులు ధ్వంసం చేసిన టీడీపీ బ్యానర్లు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 26: సార్వత్రిక ఎన్నికలు ఇంకా రాలేదు కాని గ్రామాల్లో రాజకీయ విద్వేషాలు ప్రారంభమయ్యాయి. మదనపల్లె మండలం సీటీఎం గంగ జాతర సందర్భంగా టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీల నాయకులు ప్రజలకు, నాయకులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీ బ్యానర్లు కట్టారు. ఈ క్రమంలో సీటీఎం వాస్తవ్యుడైన మదనపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్రాస్‌రోడ్డు, సీటీఎం వద్ద మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, చంద్రబాబు, లోకేశ్ చిత్రాలతో ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేశారు. కాగా ఆదివారం రాత్రి కొందరు గుర్తు తెలియని యువకులు ఈ బ్యానర్లు అన్నింటిని ధ్వంసం చేశారు. సోమవారం విషయం తెలుసుకున్న టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రశాంతగా వున్న గ్రామాల్లో కొందరు అధికార పార్టీ నాయకులు ఇలాంటి కవ్వింపు చర్యలకు దిగి రెచ్చగొడుతున్నారని, దీనిపై మదనపల్లె తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

ఐదుగురి మరణాలకు జగన్‌దే బాధ్యత



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 26: మదనపల్లె మండలంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారని దీనికి సీఎం జగన్ బాధ్యత వహించాలని టీడీపీ శ్రేణులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక అన్నమయ్యసర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ మండలాధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు మాట్లాడుతూ జగన్ ప్రవేశపెట్టిన మద్యం తాగలేకనే మదనపల్లె ప్రాంత ప్రజలు సమీపంలోని కర్ణాటకకు వెళ్లి అక్కడ మద్యం తాగి వస్తూ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమయయ్యారన్నారు. అధికారంలోకి వస్తూనే సంపూర్ణ మద్యనిషేధం తీసుకొస్తానని ప్రకటించిన సీఎం జగన్ మడమ తిప్పారన్నారు. జే బ్రాండ్ మద్యంతో కుటుంబాలు గుల్లలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కత్తి లక్ష్మీన్న, క్లస్టర్ ఇన్‌చార్జి మేకలరెడ్డిశేఖర్, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..ఇద్దరి అరెస్ట్

బి. కొత్తకోట, ఫిబ్రవరి26: అక్రమంగా కర్ణాటక మద్యం తరలించేదుకు ప్రయత్నించిన ఇద్దరు కర్ణాటక వాసులను సోమవారం అరెస్టు చేసి వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ మార్గంలో తనిఖీలు నిర్వహిస్తుండగా గౌనిపల్లెకు చెందిన మునీర్(32), అజీజ్‌సాబ్(38) ఓ ఆటోలో రూ.19,200 విలువ చేసే 480 మద్యం పాకెట్లతో పట్టుబడ్డారన్నారు. ఆటోను సీజ్ చేసి, నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

బి.కొత్తకోటలో 15 మంది బైండోవర్

బి. కొత్తకోట, ఫిబ్రవరి26: బి. కొత్తకోట మండల పరిధిలో వివిధ నేరాలలో గతంలో నిందితులైన 15 మందిని సోమవారం తహశీల్దార్ కార్యలయంలో బైండోవర్ చేసినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. పేకాట, మద్యం రవాణా, రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై ఎలాంటి నేరాలకు పాల్పడకూడదని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

చింతకాయల విషయంపై ఘర్షణ

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 26: చింతకాయల విషయంపై ఇరువర్గాలు గొడవ పడిన కారణంగా కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి పంచాయతీ వడ్డిపల్లికి చెందిన వసుంధర ఇంటి ఆరణలో ఉన్న చింతకాయల విషయంగా ఇదే గ్రామానికి చెందిన రమణ ఆలియాస్ గోవిందు, అతని భార్య లక్ష్మీదేవిలు తన కుమారుడు వినేష్‌పై దాడిచేసి గాయపరచారన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన రమణ అలియాస్ గోవిందు చింతకాయల కొరకు తన ట్రాక్టర్ వెళ్లనీయకుండా రోడ్డుపై రాళ్ల వేయడంతో వాటిని తొలగించాలని అడిగినందుకు గాయపరచారని ఫిర్యాదు చేయడంతో వసుంధర, రెడ్డిమోహన్, గంగులమ్మపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇరువర్గాలు ఘర్షణ కారణంగా ఇద్దరికి గాయాలు కాగా 5మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇప్పటి వరకు 42 మంది కేశాలు దానం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26: హెల్పింగ్ మైండ్ హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇప్పటి వరకు 42 మంది క్యాన్స ర్ బాధితుల కోసం కేశాలను దానం చేశారని హెల్పింగ్ మైండ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అబూబకర్ సిద్దిక్ పేర్కొన్నారు. మదనపల్లె కేంద్రంగా రక్తదా నం, ఫుడ్‌బ్యాంక్, ప్యాడ్‌బ్యాంక్ సేవలతోపాటు క్యాన్సర్ బాధితుల కోసం తోడుగా నిలవాలనే గొప్ప ఆశయంతో హెల్పింగ్ మైండ్ సభ్యులు హెయిర్ డొనేషన్ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. మదనపలెలకు చెందిన ఓ మహిళ ముందుకు వచ్చి క్యాన్సర్ బాధితుల కోసం తన కేశాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారని ఆమెకు ప్రశంసా పత్రంతో పాటు పూల మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ బాధితులకు విగ్గులు తమ సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్ సభ్యులు పవన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నలవీరగంగాభవానీ జాతర

● భక్తులతో పోటెత్తిన ఆలయం ● అమ్మవారికి పొంగళ్లు, దీలు, బోనాలు సమర్పించిన మహిళలు ● ప్రత్యేక ఆకర్షణగా చాందినీ బండ్లు



అలంకరణలో అమ్మవారు



చాందీని బండ్ల ఏర్పాటు దృశ్యం



అమ్మవారి తిరుణాలకు హాజరైన భక్తజనం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26: మదనపల్లె మండలం సీటీఎం గ్రామంలో వెలసిన నలవీరగంగాభవానీ అమ్మవారి జాతరను ప్రజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు భక్తులు పోటెత్తారు. సోమవారం అమ్మవారి రాత్రి తిరుణాల అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్యంగా గ్రామాల నుంచి చాందినీ, అన్నవ, టెంకాయపట్ల బండ్లు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బండ్లను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. బళ్ళారి డ్రమ్స్, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య చెక్కభజనలతో చాందినీ బండ్లు జాతరలోకి ప్రవేశించాయి. అర్ధరాత్రి తరువాత అధికసంఖ్యలో చాందినీ బండ్లు, టెంకాయపట్ల బండ్లు తిరుణాలకు చేరుకుని ఆలయ ఆవరణలోకి తరలిరావడంతో ఆలయప్రాంగణం అంతా భక్త జనంతో కిక్కిరిసిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చాందినీ బండ్లు ఎక్కువగా కట్టారు. మదనపల్లె మండలంలోని సీటీఎం, సీటీఎం క్రాస్, దుబ్బిగానిపల్లె, కొత్తవారిపల్లె, పోతబోలు గ్రామాల నుంచే కాకుండా వాల్మీకిపురం, మదనపల్లె మండలాల చుట్టుప్కకల గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున చాందినీ బండ్లు కట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు. సోమవారం ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అలంకరణలతో అభిషేకాలు, అర్చనలు, విశేషంగా పూజలు చేశారు. అనంతరం కొత్తవారిపల్లె, సీటీఎం, సీటీఎం క్రాస్ రోడ్డు, దుబ్బిగానిపల్లె, పోతబోలు గ్రామాల నుంచి మహిళలు చీర,సారెతో కూడిన పొంగళ్లను, దీలు, బోనాలను అమ్మవారికి సమర్పించారు. అదే విధంగా అమ్మవారి ఆలయం ముందర పొట్టేళ్లు, మేకపోతులను బలిచ్చారు. ఆలయకమిటీ సభ్యులు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనందపార్థసారథి, పారపట్ల సురేంద్రరెడ్డి, వెలుగు చంద్ర, పోగాకు వీరప్రతాప్‌లు భక్తులకు సౌకర్యాలను కల్పించారు.

అశ్రునయనాలతో మృతులకు అంత్యక్రియలు

●బాధిత కుటుంబాలను పరామర్శించిన జనసేన నేత రామ్‌దాస్‌చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, దొమ్మలపాటి రమేశ్



రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి



రైతు అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఆసుపత్రి వద్ద బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

మదనపల్లె, ఫిబ్రవరి 26: మదనపల్లె మండలం బెంగళూరు ప్రధాన రహదారి బార్లపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల మృతులకు ఆప్తులు, బంధువుల అశ్రునయనాల మధ్య సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ సంఘనటల్లో ఇద్దరు రైతులు సహా మొత్తం అయిదుగురు మృత్యువాత పడటం స్థానికంగా ఆందోళన కలిగించటమే కాదు..తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మృతిచెందిన ఇద్దరు రైతులతోపాటు ముగ్గురు యువకుల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కోళ్లవారిపల్లెలో ఇద్దరి రైతులకు, మిగిలిన ముగ్గురు యువకులకు వేర్వేరుగా కుటుంబీకులు అంత్యక్రియలు చేపట్టారు. మదనపల్లె మండలం కోళ్లవారిపల్లెకు చెందిన రైతులు చంద్రయ్య(45), సుబ్రహ్మణ్యం(55)కు ఇందులో ఏ మాత్రం ప్రమేయం లేకపోయినా..స్కార్పియో రూపంలో మృత్యువు కాటేయడం ఆ రెండు కుటుంబాల్లో పెనువిషాదం నెలకొంది.

అంతా యువకులే..పెళ్లికాని వారే

మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురూ..యువకులే, పెళ్లికానీ వారే. మదనపల్లె పట్టణం తట్టివారిపల్లెకు చెందిన టి.చిన్నరెడ్డెప్ప కుమారుడు టి.శ్రీనాథ్(25), అమ్మచెరువుమిట్టకు చెందిన టి.మల్లికార్జున కుమారుడు టి.తిలక్(18) దేవతానగర్‌కు చెందిన సి.చలపతి కుమారుడు సి.విక్రమ్(37)లు దుర్మరణం చెందారు. అలాగే ఇదే వాహనంలో ప్రయాణిస్తున్న రామారావుకాలనీకి చెందిన జి.నాగరాజ కుమారుడు జి.హరీష్, నీరుగుట్టువారిపల్లెకు చెందిన జి.సోమశేఖర్ కుమారుడు జి.చరణ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక జిల్లా ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు వారిని తిరుపతికి రెఫర్ చేశారు. నీరుగట్టువారిపల్లెకు చెందిన కె.వెంకటరమణ కుమారుడు కె.మహేష్‌కు ప్రాణాపాయస్థితి నుంచి బయట పడటంతో జిల్లా ఆసుపత్రిలోనే చికిత్స చేస్తున్నారు. వారంతా ఇంటికి వారసులేనని చెబుతున్నారు. పిల్లలు చేసిన తప్పునకు తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చినట్లయింది.

నాయకుల పరామర్శ..ఆర్థికసాయం

ప్రమాద ఘటన తెలుసుకున్న వివిధ పార్టీ నాయకులు స్థానిక జిల్లా ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ అక్కడే ఉంటూ మృతదేహాలను మార్చురీకి తరలించడం నుంచి పోస్టుమార్టం వరకూ అన్నీ దగ్గరుండీ చూసుకున్నారు. ఆపదలో మేమున్నామంటూ ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా ముందుకొచ్చారు. ఇందులో మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, ఎం.షాజహాన్‌బాషా, దేశాయ్ తిప్పారెడ్డి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, మైనార్టీనేత ఎస్‌ఏమస్తాన్, జనసేన నేతలు గంగారపు రామ్‌దాస్‌చౌదరి, శ్రీరామ రామాంజనేయులు, వైసీపీ సమన్వయకర్త ఎస్.నిస్సార్ అహ్మద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, తదితరులు బాధితులను పరామర్శించారు. అలాగే మృతిచెందిన ఇద్దరి రైతు కుటుంబాలకు దహనసంస్కారాల నిమిత్తం జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి రూ.25వేలు చొప్పున ఆర్థిక సాయం చేయగా, వైసీపీ నిస్సార్ అహ్మద్..అయిదు కుటుంబాలకు మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు.

పీటీఎంలో బీజేపీ ప్రజాపోరు యాత్ర

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 26 : బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రజాపోరు యాత్ర సోమవారం మండల కేంద్రమైన పీటీఎంకు చేరుకుంది. ప్రజాపోరుయాత్ర పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఈ ప్రజాపోరు పేరుతో ఈ యాత్రను ప్రారంభించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపోరు జిల్లా కన్వీనర్ నానబాల లక్ష్మణ్ కుమార్, కో కన్వీనర్ శివయ్య, రాష్ట్ర పదాధికారి గోపాల్‌రెడ్డి, రాజం పేట జిల్లా సెక్రటరీ శోభరాణి, ప్రజాపోరు తంబళ్లపల్లె కన్వీనర్ పసుపులేటి గోపి,అసెంబ్లీ కన్వీనర్ మంగరాజు, పీటీఎం మండల అధ్యక్షుడు శంకర, శంకరమూర్తి, నాగరాజు, రవి, మహబూబ్‌బాష, ములకలచెరువు అధ్యక్షుడు జయరాంరెడ్డి రమణ పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

బి. కొత్తకోట, ఫిబ్రవరి26: బి. కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఆదిత్య డిగ్రీ కళాశాల లో ఈ నెల 29 న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరే షన్ సహకారంతో జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారి హరిక్రిష్ణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాబ్‌మేళాలో కియామోటార్స్, అమెజాన్, అపోలో, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు.డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, ఇంటర్ చదివిన విద్యార్థులు తమ ఆధార్, సర్టిఫికెట్లు బయోడేటాలతో ఉదయం 9.30 పైన కళాశాలలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9966655167, 8328347130 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏపీఎన్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏవీ సుబ్బారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడిగా మదనపల్లెకు చెందిన డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి నియమితులైయారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ గతంలో ఇండియన్ మేడికల్ అసోసియేషన్ హార్సిలీహిల్ బ్రాంచ్ సెక్రటరీగా మూడేళ్లు, అధ్యక్షులుగా మూడేళ్లు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పని చేశానన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పాట్లు

గుర్రంకొండ, ఫిబ్రవరి 26:గుర్రంకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఆదాయ ధృవీకరణ పత్రాలను మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. గుర్రంకొండ తహశీల్దార్‌గా శ్రీనాథ్ కొత్తగా బాధ్యతలను చేపట్టారు. ఈ క్రమంలో ఆదాయ ధృవీకరణ పత్రాలను కార్యాలయంలో పని చేసే ఉపతహశీల్దార్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాల్సివుంది. కార్యాలయంలో ఉపతహశీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఆదాయ ధృవీకరణ పత్రాలను తహశీల్దార్ లాగిన్‌లోనే మంజూరు చేయాలని సిబ్బంది పేర్కొంటున్నారు. కాగా కార్యాలయంలో ఉపతహశీల్దార్‌కు బదులుగా రీసర్వే డీటీ ఉన్నారు. దీంతో ఆదాయ ధృవీకరణ పత్రాలను రీసర్వే డీటీ లాగిన్‌లో ఇవ్వవచ్చునన్ని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆదాయ ధృవీకరణ పత్రాలను తన లాగిన్‌లో ఇవ్వరాదని రీసర్వే డీటీ వాదన. ఈ విషయమై తహశీల్దార్ శ్రీనాథ్ వివరణ కోరగా ఆదాయ ధృవీకరణ పత్రాలు విద్యార్థులకు సకాలంలో అందేలా చూస్తామన్నారు.

శైవ క్షేత్రాల్లో విశేషపూజలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26: పట్టణంలోని పలు శైవక్షేత్రాల్లో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినానికి ముందు సోమవారం కావడంతో చిప్పిలి మడికయ్యల శివాలయంలో అర్చనలు, అభిషేకాలు, విశేషపూజలు ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద నిర్వహించారు. ఈ పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో మంజునాథస్వామికి విశేషపూజలు చేశారు.

ఇసుకాసురులను ఇళ్లకు పంపే సమయం ఆసన్నమైంది!

● పీలేరులో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



భవన నిర్మాణ కూలీలతో మాట్లాడుతున్న కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 26: ప్రజందరికీ ఉచితంగా అందాల్సిన ఇసుకను మింగేసిన వైసీపీ ఇసుకాసురులను ఇళ్లకు పంపే సమయం ఆసన్నమైందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పీలేరు పట్టణం కొత్తపల్లె రోడ్డులోని రత్నం స్కూలు, రాజీవ్ నగర్ కాలనీ, బృందావనం నగర్, జీవీ నగర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ రంగ కూలీలతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వైసీపీ సర్కారు వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని ఎత్తివేసి దానిని వ్యాపార వస్తువుగా మార్చివేసి అడ్డంగా దోచుకుంటూ కోట్లు గడిస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో ఆ రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అనేక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కిశోర్ వాపోయారు. ఇసుక దోపిడీతో నేడు పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, వాల్మీకిపురం మండ లాల్లోని చాలా ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఏర్పడే దుర్భర పరిస్థితులు తలెత్తాయన్నారు. . పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థిగా అధికారిక ప్రకటన తరువాత తొలిసారి పీలేరుకు వచ్చిన ఆయనకు స్థానిక టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. కార్యక్రమంలో నాయకులు ఆర్‌బీఐ రమణారెడ్డి, యల్లెల రెడ్డప్ప రెడ్డి, బాబు, ఆబిద్ అలీ, షౌకత్ అలీ, చాన్ బాషా, రియాజ్, ఫిరోజ్, పురం రెడ్డమ్మ, సాధన, లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, షమ, రెడ్డిముని, సురేశ్, నాగేంద్ర, నాగేంద్ర నాయక్, బాలకృష్ణ, జెట్టి దుర్గాప్రసాద్, సాయి, షౌకత్, బాలా, కాలనీ శీనా, రమణ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 25: కుంట పొరంబోకు భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వాల్మీకిపురం మండలం తాటిగుంటపల్లె గ్రామస్థులు స్పందనలో ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో రఫిక్‌అహ్మద్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. తాటిగుంటపల్లె గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో కుంటపొరంబోకు భూములను కొందరు ఆక్రమించుకుని, ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో మౌలిక వసతులు కల్పించాల షేక్ ఖాదర్‌బీ అర్జీ అందజేశారు. వాటితో పాటు భూ సమస్యలపై 28 అర్జీలు వచ్చాయి.

తాడేపల్లెగూడెం సభను జయప్రదం చేయండి

మదనపల్లె, ఫిబ్రవరి 26: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లెగూడెంలో ఈనెల 28న జరిగే జనసేన-టీడీపీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్.ప్రథమంగా చేపడుతున్న ఈ సభకు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బర్మావీధిలోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి వాహనాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పార్టీనాయకులు, కార్యకర్తలు, జనసైనికులు తరలిరావాలని శ్రీరామ రామాంజనేయులు కోరారు.

అమరావతికి చేరిన తంబళ్లపల్లె పంచాయితీ

● టికెట్ కేటాయించాలంటూ టీడీపీ, శంకర్ వర్గీయుల ధర్నా



ధర్నా చేస్తున్న శంకర్ వర్గీయులు, టీడీపీ శ్రేణులు

ములకలచెరువు, ఫిబ్రవరి 26: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ పంచాయితీ అమరావతికి చేరింది. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్‌కు టికెట్ కేటాయించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు, శంకర్ వర్గీయులు ధర్నా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో టీడీపీ నేతలు కొల్లు రవీంద్ర తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన 15 మంది ముఖ్య నేతలను చంద్రబాబు నివాసంలోకి పిలుచుకెళ్లి అధినేత చంద్రబాబుతో మాట్లాడించారు. ఈ సందర్భంగా వారం రోజుల్లోగా మళ్లీ సర్వే చేయించి మాజీ ఎమ్మెల్యే శంకర్‌కు తగిన న్యాయం చేస్తానని చంద్రబాబు తమకు హామీ ఇచ్చినట్లు శంకర్ వర్గీయులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శ్రీనాథరెడ్డి, టీడీపీ నేతలు కుడుం శ్రీనివాసులు, పలువురు మండల టీడీపీ అధ్యక్షులతో పాటు ఆరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో టీడీపీ-జనసేన జెండాలు ఎగరేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 26: సార్వత్రిక ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గ గడ్డపై టీడీపీ-జనసేన పార్టీల జెండాలు ఎగరేద్దామని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ములకలచెరువులో సోమవారం తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన భారీ ర్యాలీ ద్విచక్రవాహన, వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తనకు సంపూర్ణ మద్దతు పలికిన జనసైనికులకు కృతజ్ఞతలు తెలిపి కలిసి కట్టుగా ముందుకు సాగుదామన్నారు.

ముఖ్యనేతల కలయిక: తంబళపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సోమవారం పలువురు టీడీపీ ముఖ్య నేతలను కలిశారు. మదనపల్లెకు వెళ్లి టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజుతోపాటు బురకాయలకోటలో పలువురిని కలిశారు. కాగా పార్టీ కార్యాలయంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిశారు.

మద్యపాన నిషేధం పేరుతో మహిళలను ఏడ్పించిన వైసీపీ

రాష్ట్రంలో సంపూర్ణ మద్యపానం పేరుతో ప్రజలను, మహిళలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసి ఏడ్పించిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు సోమవారం ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల మ్యానిఫెష్టోలో సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం మాట తప్పిందన్నారు నాసికరం, కల్తీ మద్యం తాగి రాష్ట్రంలో 30వేల మంది చనిపోవడానికి వైసీపీ ప్రభుత్వం కారణమైందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధాలు మాట్లాడుతూ సంపూర్ణ మద్యం నిషేదం చేస్తామని మాట తప్పిన వైసీపీ ప్రభు త్వానికి మహిళలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నాయకులు తలారి మంజునాథ్, ఆంజనేయరెడ్డి, ఫజురుల్లా, శంకర్‌రెడ్డి మస్తాన్‌రెడ్డిలతో పాటు వందలాది మంది టీడీడీ, జనసైనికులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయమే మాకు శిరోధార్యం

●తంబళ్లపల్లె అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తాం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్



మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

బి కొత్తకోట, ఫిబ్రవరి26: పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధినేత చంద్రబాబు నిర్ణయం మాకు శిరోధార్యంమని, ప్రతి కార్యకర్త అధిస్థానం మాటకు కట్టుబడాల్సిందేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. తంబళ్లపల్లె అభ్యర్థిగా ప్రస్తుత ఇన్‌చార్జిగా ఉన్న శంకర్‌యాదవ్ స్థానంలో జయచంద్రారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఆమె బి.కొత్తకోటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సంక్షేమం కోసం టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు వివిధ రకాల సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. పార్టీ పదవులు తీసుకుని గుర్తింపు పొందిన నాయకు లు పార్టీ ప్రకటించిన అభ్యర్థి జయచంద్రారెడ్డికి మద్దతుగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీ అరాచక పాలనను అంతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావం తో పనిచేసి తంబళ్లపల్లెలో పార్టీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శత్రుజ్ఞ, పద్మనాభ, సఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తాం



కాంగ్రెస్ ర్యాలీలో ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్, కార్యకర్తలు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 26: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తామని ఆపార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అల్లాబకస్, ఉపాధ్యక్షుడు ఎస్ఎండీ ఇస్మాయిల్ వెల్లడించారు. పెద్దమండ్యం మండలం కలిచెర్లలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉపాధ్యక్షుడు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లాలో అన్ని స్థానాలకు కాంగ్రెస్ పోటీ చేస్తుందని వెల్లడించారు. అనంతరం కలిచెర్లలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబానికి రూ.5 వేలు ఇస్తుందన్నారు. అనంతరం అనంతపురం సభకు తరలివెళ్లారు.

న్యాయసాధన సభకు తరలిన కాంగ్రెస్ నేతలు



న్యాయసాధన సభకు వెళుతున్న చంద్రశేఖర్ రెడ్డి తదితరులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి26:అనంతపురం పట్ట ణంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ న్యాయ సాధన సభకు తంబళ్లపల్లె నియో జక వర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కన్వీనర్లు బావాజాన్, వాసు, శ్రీకాంత్‌రెడ్డి, క్రిష్ణారెడ్డిలతో పాటు 150కి పైగా వాహనాలలో న్యాయసాధన సభకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పీసీసీ పగ్గాలు షర్మిలారెడ్డి చేపట్టాక కాంగ్రెస్‌పార్టీకి ఊపు వచ్చిందన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలను సకాలంలో చెల్లించాలి



డ్యాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ చేస్తున్న ఇండియన్ బ్యాంకు మేనేజరు హరినాథ్

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 26: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు నుంచి పొందిన రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించాలని తంబళ్లపల్లె ఇండియన్ బ్యాంకు మేనేజరు హరినాథ్ గుప్తా పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో 24 డ్వాక్రా సంఘాల రుణాల కు సంబంధించి డాక్యుమెంటేషన్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ...డ్వాక్రా సంఘాలకు వారి సీనియారిటీ ప్రాతిపదికన ఒక్కొక్క గ్రూపునకు రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. అర్హత కలిగిన అన్ని గ్రూపుల కు రుణాలు ఇస్తామన్నారు. రుణాలను సక్రమంగా చెల్లిస్తేనే మరిన్ని ఎక్కువ రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు, డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఉత్తమ అధికారిణిగా దేవకమ్మ



మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా, అసోసియేషన్ ఎన్‌సీసీ అధికారిణిగా పని చేస్తున్న గుర్రం దేవకమ్మ ఉత్తమ ఎన్‌సీసీ అధికా రిణిగా అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు మార్చి 1న సికింద్రా బాద్‌లో ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు దేవకమ్మను అభినందించారు.